

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఈ విజయానికి మీరే స్ఫూర్తి



ఎడిటర్: మహేష్ యాదవ్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 93 శుక్రవారం 03 - 04 - 04 -2026 పేజీలు : 12 వెల-3

## అమరావతికి చట్టబద్దతకు థాంక్స్



### ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు

అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్జీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు.



# అమరావతిలో రైతులతో సిఎం చంద్రబాబు భేటీ

### అన్‌స్టాపబుల్ అమరావతి అంటూ ప్రకటన

### జగన్ మావిగన్ వ్యాఖ్యలపై మండిపాటు

### శిలాఫలకం వద్ద సాష్టాంగ ప్రణామం

అమరావతి బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని చెప్పారు. అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతీ ఆంధ్రుడికీ గర్వకారణమన్నారు. అమరావతి ప్రస్థానంలో ప్రతి అడుగులో ప్రధాని మోదీ అండగా నిలిచారని తెలిపారు. రాజధాని రైతులు చేసిన త్యాగం, చూపిన పట్టుదల మరువలేనివని, ఈ విజయం వారికే అంకితమన్నారు. అమరావతే ఇక ఆంధ్రులకు ఏకైక ప్రజా రాజధాని అని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై ఉద్ధండరాయునిపాలెంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సతీసమేతంగా వెళ్లిన సీఎం చంద్రబాబుకు అక్కడి రైతులు, మహిళలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఉద్ధండరాయునిపాలెంలో శంకుస్థాపన శిలాఫలకాన్ని సీఎం పరిశీలించారు. అమరావతిలో పవిత్ర నీరు, మట్టి ప్రదేశం వద్ద చంద్రబాబు మోకరిల్లారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అమరావతికి వచ్చింది తాత్కాలిక ఇబ్బందులేనని, ఇక అపజయం లేదని అన్నారు. రైతుల ఐకమత్యమే అమరావతిని గెలిపించింది. ప్రపంచంలోనే ఉత్తమ రాజధానిగా అమరావతిని తయారు చేస్తాం.

## అనిశ్చితికి తెరపడింది.. అమరావతి ఏకైక రాజధానిగా నిలిచింది:



ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు, గురువారం పెద్దల సభలోనూ నెగ్గడంతో అమరావతికి రాజధానిగా తిరుగులేని చట్టపరమైన హోదా లభించింది. ఈ చారిత్రక పరిణామం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "త్యాగాల పునాదుల నుంచి, ఆశలు మోసుకొచ్చిన కన్నీటి నుంచి, అనిశ్చితిని భరించిన నిశ్శబ్దం నుంచి అమరావతి నేడు కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ గౌరవంగా నిలబడింది" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి, పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించిందని అన్నారు.

# బ్లాక్‌లో వాణిజ్య సిలిండర్లు!



ఒక్కోదానిపై రూ.3,500-5,000 వరకు ఎక్కువ వసూలు లబోదిబోమంటున్న హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారులు

### ఆ అధికారుల నిర్బంధం తెలియదు..

# పాలన నా చేతుల్లో లేదు:



మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి.

ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు.

## భారత రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్లు



2025-26లో రికార్డు స్థాయిలో 62 శాతం వృద్ధి



# గెలిచి.. నిలిచింది!

### అమరావతి ప్రస్థానంలో కీలక ఘట్టాలు 2014లో ఆవిర్భావం నుంచి.. తాజాగా పార్లమెంటు ఆమోదం దాకా

## పోలవరం ప్రాజెక్టు పను లను పరిశీలించిన రాష్ట్ర గవర్నర్ఎస్ అబ్దుల్ నజీర్



9లో

# ఈ విజయానికి మీరే స్ఫూర్తి

ప్రజల్లోకి వెళ్లామని చెప్పారు. ముఖ్యంగా ట్రిపుల్ తలాక్ రద్దుపై ముస్లిం మహిళలు హర్షం వ్యక్తం చేశారని, అందుకే మైనారిటీలు ఎక్కువ ఉన్న డివిజన్లలో బీజేపీ విజయం సాధించిందని సంజయ్ వివరించారు. దీంతోపాటు 'మోదీ గిఫ్ట్' పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన అంశాన్ని ప్రస్తావించారు. 'ప్రజలకు నిరంతరం సేవ చేయడంలోనే తృప్తి ఉంటుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయండి. అట్టడుగు వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో నిర్విరామంగా పనిచేయండ'ని మోదీ సంజయ్‌కు సూచించారు.

**నా పేరు చెప్పి దందాలు చేస్తే చర్యలు** భగత్‌నగర్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తన పేరు చెప్పి ఎవరైనా కబ్జాలు, అక్రమ దందాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎవరైనా తన పేరు చెప్పుకుని అక్రమ దందాలు, పంచాయతీలు, సెటిల్‌మెంట్లతో ప్రజలను ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు సైతం అలాంటి పైరవీకారులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ పార్టీకి మంచి పేరు తెచ్చేలా పనిచేసేవారిని ప్రోత్సహిస్తానని, అదే సమయంలో ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తన పేరు చెబుతూ ఇబ్బంది పెడితే వెంటనే తన ఎంపీ కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

**మాయమాటలు కాంగ్రెస్ నైజం** బీజేపీ మాయమాటలు, బూటకపు హామీలు కాంగ్రెస్ నైజమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండా రి శాంతికుమార్ దుయ్యబట్టారు. తెలంగాణ, రూ.6 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్న సంగతి తెలిసి కూడా కాంగ్రెస్, గత ఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని హామీలిచ్చిందన్నారు. వనపర్తి జిల్లా ఖిలా ఘన్‌పూర్‌కి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శాంతికుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. 'బీజేపీలో నీటి బిందువుల్లా చేరికలు జరుగుతున్నాయి.. ఇవి మహాసంద్రంగా మారే రోజు ఎంతోదూరంలో లేద'ని ఆయన అన్నారు. **కమ్యూనిస్టులతో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి: బీజేపీ** కమ్యూనిస్టు పార్టీలతో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అనుసరిస్తోందని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీలతో ఒకవైపు జాతీయస్థాయిలో వ్యూహాత్మక ఒప్పందం చేసుకోవడం, మరోవైపు కేరళ వంటి రాష్ట్రాల్లో వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు నటించడం కాంగ్రెసకు అలవాటేనన్నారు. ప్రధాని మోదీ, కేరళం సీఎం విజయన్ సోదరులంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన హోదాకు తగవన్నారు. కమ్యూనిస్టు పార్టీల నాయకులు కాంగ్రెసకు అమ్ముడుపోయారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ ఆరోపించారు.

# దిక్కుతోచని ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు ఆ ప్రసంగం చేయకపోతేనే బాగుండేది. పొద్దున్న లేచినదగ్గరనుంచి పొద్దుపోయేవరకూ ఆయన ఏదేదో మాట్లాడేవారు, మీడియా నచ్చింది రాసుకొనేది, ఎవరు మెచ్చింది వాళ్ళు నమ్మేవాళ్ళు. మార్కెట్లు కిందిమీదా పడుతూండేవి. ఎప్పుడైతే ఆయన యుద్ధం గురించి శ్వేతసౌధంలో ప్రత్యేక ప్రసంగం చేయబోతున్నారని తెలిసిందో, అప్పటినుంచీ ప్రపంచానికి కొత్త టెన్షన్ ఆరంభమైంది. ఆయన ఎన్నడూ చెప్పింది చేయడన్నది నిజమే కానీ, యుద్ధంపై ఈ కీలకసందేశంతో అమెరికా విధానం స్పష్టమైపోతుందని ప్రపంచం నమ్మడంతోనే చిక్కు వచ్చిపడింది. ఇంతకూ ట్రంప్ తన పందొమ్మిది నిముషాల ప్రసంగంలో ఏం చెప్పారు, ఏం తేల్చారు? ఆ బుర్రలో ఎంత గందరగోళం ఉన్నదో లోకానికి మరింత స్పష్టమైంది తప్ప, యుద్ధం ఎప్పుడు, ఎలా ముగుస్తుందో, ఈ ఉత్పాతంనుంచి ప్రపంచం ఎన్నటికి బయటపడుతుందో ఎవరికీ అర్థంకాలేదు. అవే ఊకదంపుడు మాటలు, చర్విత చర్వణాలు, స్వభుజతాడనాలు. టీవీ ముందు కూచొని, ప్రసంగాన్ని విన్నవారు కొత్త పదజాలం దట్టించిన ఆ పాత గొప్పల్ని మళ్ళీ విని భరించలేకపోయి ఉంటారు. స్పష్టత, దిశ లేని ఆ ప్రసంగం ఒక విషయాన్ని మాత్రం తెలియచెప్పింది. పూర్తిగా యుద్ధంలో మునిగిన డోనాల్డ్ ట్రంప్ కాలువెనక్కుతీసుకొనే మార్గం లేక మల్లగుల్లాలు పడుతున్నారని. ప్రసంగిస్తున్న సమయంలో ఆయన వెలిబుచ్చిన హావభావాల ఆధారంగా సాగిన విశ్లేషణలు సైతం ఆయన ఆత్మవిశ్వాసం నీరుగారిందన్నాయి. తన లక్ష్యాలు నెరవేరాయని అంటూనే మరో రెండు మూడువారాలపాటు యుద్ధం మరింత తీవ్రతరం చేయబోతున్నట్టుగా ఆయన చేసిన వ్యాఖ్యలు అమెరికా వ్యూహంమీద కొత్త ప్రశ్నలు లేవనెత్తాయి. కొత్త లక్ష్యాలమీద, సైన్యం ప్రత్యక్షప్రవేశం సహా సరికొత్తదారుల్లో ఇరాన్‌ను తీవ్రంగా మొత్తేయాలని ఆయన అనుకుంటున్నట్టు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో అమలు, ఒనగూరే నష్టంమీద ఆయనకు అనుమానాలున్నాయి. మరోమారు, ఈ ప్రసంగంలోనూ ఆయన అమెరికా మిత్రదేశాలను, మరీ ముఖ్యంగా నాటోను ఆడిపోసుకున్నాడు, అవమానించాడు. తనతో కలిసిరాని, తనకు ఇక అవసరం లేని నాటోతో పూర్తి కటీఫ్ అన్నరీతిలో వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ ప్రసంగం ఎవరికి అర్థమైనా, కాకున్నా మార్కెట్‌ను మాత్రం మాయచేయలేకపోయింది. ప్రసంగం ముగిసిన వెంటనే అమెరికా మార్కెట్ ఇంకా చతికిలబడింది. ట్రంప్ తన ప్రసంగంలో, అమెరికన్లకు తనపై ఉన్న విశ్వాసం కంటే, ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకం గురించి మాట్లాడి, అదే తన యుద్ధానికి విస్తృతామోదంగా చెప్పుకున్న కొద్దిసేపట్లోనే మార్కెట్ పడిపోయింది. యుద్ధం ముగింపు, హోర్ముజ్ విముక్తి ఇత్యాది విషయాల్లో పెట్టుబడిదారులకు నమ్మకం కలగలేదని అర్థం. నెలరోజులుగా నిలిచిపోరాడుతున్న ఇరాన్ ఒకపక్క, ఇంటిపోరు మరోపక్క ట్రంప్‌ను ఉక్కిరిబిక్కిరిచేస్తున్నాయి. లక్ష్యశుద్ధిలేని యుద్ధం అంటూ విపక్షాలు తప్పుబట్టడం అటుంచితే, ఈ యుద్ధాన్ని అమెరికన్లు గట్టిగా వ్యతిరేకిస్తున్నారని ఇటీవలి నిరసన ప్రదర్శనలు స్పష్టంచేస్తున్నాయి. వివిధ సర్వేల్లో కూడా అధికశాతం జనం వెంటనే దానిని నిలిపివేయాలని కోరుతున్నారు. ట్రంప్ ప్రసంగం ఆరంభం కావడంతోనే ఇజ్రాయెల్ మీద ఇరాన్ క్షిపణుల మోత ప్రారంభించింది. ఇరాన్ వెన్నువిరిచామనీ, త్రివిధబలాల తిక్క కుదర్చామని, క్షిపణుల పనిపట్టామని ఆయన ఒకపక్క చెబుతూంటే, మరోపక్క ఇరాన్ తలెగరేసింది. సత్వరమే ఒప్పందానికి రాకుంటే, రాతియుగానికి పంపేస్తానన్న ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ లక్ష్యపెట్టలేదని దాని చేతలే చెబుతున్నాయి. ఫిబ్రవరి 28న యుద్ధానికి దిగేముందు ఐదు లక్ష్యాలు ప్రకటించి, అవి కొద్దిరోజుల్లో నెరవేరడంతోనే సామాన్య ఇరానియన్లే రాజ్యాన్ని ఏలుకోవచ్చని గర్వంగా వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 1నాటి ప్రసంగంలో ఆ లక్ష్యాలన్నీ సాధించానని గట్టిగా చెప్పుకోలేకపోయారు. ఇరాన్ మీద ఎంత విరుచుకుపడుతున్నా, రెండువేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇజ్రాయెల్‌ను అది క్షిపణులతో ఎడాపెడా మోదుతూనే ఉంది. గల్ఫ్‌లో ఉన్న అమెరికా స్థావరాలను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. ఇప్పుడు హౌతీల రంగప్రవేశంతో మాండెబ్ జలసంధి కూడా మూసుకుపోయి, ప్రపంచ ఆర్థికవ్యవస్థ మరింత కుదేలవుతుందన్న భయం సర్వత్రా ఉంది. అమెరికా తన పరువు పూర్తిగా పోగొట్టుకొనేంతవరకూ యుద్ధం ఆపనని ఇరాన్ చేసిన వ్యాఖ్యలో అతిశయం ఉండవచ్చుగానీ, ఆ పరిస్థితి రాకముందే తెలివిగా కాలువెనక్కు తీసుకోవాల్సిన అవసరం అమెరికాకు ఉంది.

## చికెన్ బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

### డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి

చికెన్ సెంటర్ల బంద్ విజయవంతమైంది. బంద్ దెబ్బకు పౌల్ట్రీ కంపెనీలు దిగివచ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ.125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగానే కిలోకు రూ.15, ఆ పైన మార్జిన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వా హకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించు కున్నట్టు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియులు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చేసారు. దీంతో వీరు కూడా ధరలు పెంచి అమ్మారు. నాటు కోడి రేటు ఎక్కువగా ఉంటుంది కనుక సాధారణ రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువగా ఉంటాయి. నాటు కోళ్లను ఇష్టపడేవారు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. బంద్‌తో నాటు కోళ్ల పెంపకం దారులు వీటిని మార్కెట్‌కు తరలించారు. సాధారణ ధరకన్నా కాస్త ఎక్కువైనా కొనుగోలు చేశారు. చికెన్ సెంటర్ల బంద్‌తో మాంసం విక్రయాలు కూడా 20 నుంచి 25 శాతం పెరిగినట్టు మాంసం విక్రయదారులు తెలిపారు. బుధవారం నుంచి చికెన్ సెంటర్ల బంద్ జరుగుతున్న దృష్ట్యా ముందే మేల్కొన్న మాంసం విక్రయదారులు కాస్త ఎక్కువగానే జీవాలను కోసి ఉదయం నుంచే సిద్ధంగా ఉంచారు. చికెన్ అమ్మకాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మాంసం కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపారు. చికెన్ సెంటర్ల బంద్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహా ధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసు కోవాలని, విధాన పరంగా చికెన్ ధరలు, కమిషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని, చిల్లర చికెన్ వ్యాపారులు లేకుండా చేయాలని పౌల్ట్రీ కంపెనీలు చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు.

## బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం

### ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య

### చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు

జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నారాయణపేట జిల్లా బసిరెడ్డిపల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. దాంతో అవ్వా తాత.. చిన్నారి తేజశ్రీని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మరోవైపు చిన్నారి తేజశ్రీ కూడా అవ్వా, తాత దగ్గర బాగానే పెరుగుతోంది. రోజూ అంగన్‌వాడీకి వెళ్లడం.. తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. అంతా బాగుంది అనుకున్న తరుణంలో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో ఆరుబయట నిద్రించడం ఆనవాయితీ. రాత్రి అవ్వ తాతతో కలిసి తేజశ్రీ బయట నిద్రించింది. కానీ అర్ధరాత్రి సమయంలో అమ్మాయి వారి పక్కలో లేకపోవడంతో వృద్ధ దంపతులు కంగారు పడ్డారు. గ్రామస్థుల సహాయంతో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన గ్రామస్తులు హుటాహుటిన నారాయణపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసు జాగిలాలతో సంఘటన స్థలాన్ని పరీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

## వాడపల్లిలో వైభవంగా ఉత్సవాలు

### భారీగా హాజరైన భక్తులు

కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తి, శ్రద్ధల సమ్మేళనంగా తెప్పోత్సవం కొనసాగింది. విశేష పూజలతో పాటు, కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుల మేల్కొలుపుతో ప్రారంభమైన ఈ మహోత్సవంలో గౌతమి గోదావరి పవిత్ర జలాలను తెచ్చి స్వామివారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిత్యార్చన, నిత్య హోమాలు, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం వంటి వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారు అమ్మవార్లకు విశేష పూజారి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధాన హోమం అనంతరం స్వామివారిని సన్నాయి మేళాల నడుమ రాత్రి గౌతమి గోదావరి తీరం వైపు తీసుకెళ్లి, అంగరంగ వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. నది మధ్యలో సాగిన ఈ తెపోత్సవం భక్తులకు కనుల విందుగా మారి, హృదయాలను భక్తి పరవశంలో ముంచెత్తింది. స్వామివారి కోసం ప్రత్యేకంగా విద్యుత్ పూల అలంకరణలతో రూపొందించిన తెప్ప అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గోదారమ్మ ఒడిలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అందరిని మంత్రముగ్ధులను చేసింది. ఈ పవిత్ర వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా విశేషమైన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శనలు, కళా ప్రదర్శనలు, కోలాటాలు నిర్వహించారు. సమీప ప్రాంతాలు నుంచే కాకుండా సుధీర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఈ కార్యక్రమాలు ఆనందాన్ని, ఉల్లాసాన్ని నింపడంతో పాటు భక్తిని కూడా పెంపొందించాయి. భక్తుల గోవింద నామస్మరణల మధ్య సాగిన ఈ మహోత్సవం కోనసీమ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలిపింది.

## మందుల ధరలు పైకి!

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ ప్రభావం పెట్రో ఉత్పత్తుల ధరలపైనే పడుతుందని.. రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు మాత్రమే ప్రియమవుతాయని చాలా మంది అనుకుంటున్నారు! కానీ.. ఈ యుద్ధ ప్రభావం మన ఊహకు కూడా అందని రంగాలపై పడుతోంది. ఉదాహరణకు.. ఫార్మా రంగం. బల్క్ డ్రగ్స్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ముడిపదార్థాల (ఏపీఐల) సరఫరాలో కలుగుతున్న అంతరాయాలు.. మందుల ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే మందుల షాపుల్లో అందుబాటులో ఉన్న స్టాకంతా యుద్ధం మొదలు కావడానికి ముందు తయారై వచ్చింది. వాటి ధరలు అలాగే ఉంటాయిగానీ.. కొత్తగా తయారవుతున్న ఔషధాల ధరలు మాత్రం భారం కానున్నాయి. మందుల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ధరలు 200 శాతం–300 శాతం వరకు పెరగడమే ఈ పెరుగుదలకు కారణమని ఫార్మా రంగాలు పేర్కొంటున్నాయి. దీంతో, పలు ఔషధాల ధరలను 20 శాతం నుంచి గరిష్ఠంగా 180 శాతం దాకా పెంచి విక్రయించాలని ఇప్పటికే నిర్ణయించినట్టు ఫార్మా రంగానికి చెందిన విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. సుమారు 900 రకాల ఆవశ్యక ఔషధాల (ఎసెన్షియల్ మెడిసిన్స్) ధరలు పెరగనున్నాయి. ఎక్కువ మంది ఉపయోగించే పారాసెటమాల్, యాంటీ బయాటిక్స్, నొప్పి నివారణ మందులు, ఇన్సులిన్, స్టెరాయిడ్ ఔషధాల కొత్త స్టాకు ధరలను ఇప్పటికే పెంచినట్టు సమాచారం.

## అమరావతిలో రైతులో సిఎం చంద్రబాబు భేటీ

తెలుగు జాతి గౌరవం, గుండె అమరావతి. వైకాపాకి ఇంకా జ్ఞానోదయం కలగలేదు. వైకాపా పీడ రాష్ట్రానికి విరగడ కావాల్సి ఉందన్నారు.. మావిగన్ అంటూ జగన్ కొత్త పదం తీసుకొచ్చారు. మావిగన్ అంటే ఏంటో డిక్షనరీలో చూశాను. నాకెక్కడా దాని అర్థం దొరకలేదు. అమరావతిని చంపాలనుకున్న వైకాపా.. బాగుపడే సమస్యే లేదు. వాకౌట్ చేసిన వైకాపాను.. ప్రజలు బ్లాకౌట్ చేయాలి. వైకాపా చేసినంత నీతిమాలిన రాజకీయం ఎప్పుడూ చూడలేదు. అమరావతి, విశాఖ, తిరుపతి ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా మాట ఇస్తున్నా. అమరావతి ఇక అన్‌స్టాపబుల్.. అజరామరం అంటూ ప్రకటించారు. అమరావతికి ఘనమైన చరిత్ర ఉంది. వైకాపా మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ బిల్లుకు మద్దతిచ్చాయి. అమరావతితో నాకు చాలా ఎమోషన్ ఉంది. కుట్రలు, విధ్వంసకర పరిస్థితులను ఎదుర్కొని రాజధాని సంపాదించుకున్నాం. జగన్ మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడారు. రాజధానికి 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. ఇది రాజధాని కాదు.. ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నం. కుట్రలు, విధ్వంసకర పరిస్థితుల్లో రాజధాని సంపాదించుకున్నాం. అమరావతికి గెలుపే తెలుసు.. ఓటమి అంటే ఏమిటో తెలియదు. మీ ఐకమత్యంతో రాజధానిని గెలుచుకున్నాం. అమరావతి చరిత్రలో మీ ప్రతాపం, పట్టుదల చూపించారు. చరిత్ర ఉన్నంతవరకు అమరావతి ఉంటుందని చంద్రబాబు అన్నారు.

## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

## అనిశ్చితికి తెరపడింది.. అమరావతి

## ఏకైక రాజధానిగా నిలిచింది:

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, ఈ విజయం ఎన్డీఏ ప్రభుత్వంపై చెక్కుచెదరని విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదని తెలిపారు. అమరావతి ఆత్మ రైతుల త్యాగంలోనే ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "33,000 ఎకరాలకు పైగా భూములను రైతులు బలవంతంగా ఇవ్వలేదు. భవిష్యత్‌పై, ఒక దార్శనికతపై నమ్మకంతో ఇచ్చారు. ఈ రోజు వారి నమ్మకాన్ని గౌరవించగలిగాం" అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్రానికి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులు అర్పించారు. గత కొన్నేళ్లుగా అమరావతిని అనిశ్చితిలోకి నెట్టారని, విధానాలు మార్చి రైతులను మోసం చేశారని, ప్రజల ఆకాంక్షలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ అనిశ్చితికి తెరపడిందన్నారు. ఇది కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని పేర్కొన్నారు. స్పష్టమైన దార్శనికతతో అమరావతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రతి కీలక సమయంలో రాష్ట్రానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై అమరావతి స్థిరత్వం, ప్రగతికి చిహ్నంగా, తరతరాలకు వారధిగా నిలిచే ప్రజల రాజధాని అవుతుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు.

# గెలిచి.. నిలిచింది!

రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరాయంగా జరిగి ఉంటే ఈపాటికి ఓ రూపు వచ్చేది. కానీ ఆంధ్రుల కలల రాజధానిని గత జగన్ ప్రభుత్వం సమాధి చేయాలని చూసింది. మూడు ముక్కలాటతో నిర్వీర్యం చేయాలని ప్రయత్నించింది. కూటమి ప్రభుత్వం రావడంతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టాక... తాజాగా పార్లమెంటులో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర పునర్విభజన సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం వరకూ కీలక ఘట్టాలు..

2014 జూన్ 2: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంతో హైదరాబాద్ పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా మారింది.

2014 సెప్టెంబరు 1: గుంటూరు–విజయవాడ మధ్య రాజధాని ప్రాంతాన్ని ఖరారు చేశారు.

2014 సెప్టెంబరు 3: గ్రీన్ ఫీల్డ్ విధానంలో రాజధాని నగరాన్ని నిర్మించాలని అసెంబ్లీ తీర్మానం చేసింది.

2014 డిసెంబరు 8: రాజధానిపై మాస్టర్ ప్లాన్ తయారీకి సింగపూర్ సంస్థలతో ఒప్పందం.

2014 డిసెంబరు 30: సీఆర్‌డీఏ చట్టం అమల్లోకి వచ్చింది. అమరావతిలో రాజధాని ఏర్పాటుకు అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయి.

2015 జనవరి: రాజధాని కోసం భూ సమీకరణ ప్రారంభమైంది.

2015 మార్చి: 29 గ్రామాల్లో సుమారు 33 వేల ఎకరాల సమీకరణకు రైతుల అంగీకారం లభించింది.

2015 ఏప్రిల్ 23: రాజధాని నగరానికి అధికారికంగా అమరావతి పేరు పెట్టారు.

2015 జూలై 20: రాజధాని మాస్టర్ ప్లాన్లను సింగపూర్ బృందం ప్రభుత్వానికి అందజేసింది.

2015 అక్టోబరు 22: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతికి శంకుస్థాపన చేశారు. అన్ని ప్రాంతాల నుంచి మట్టి, నీరు తెచ్చారు.

2016 ఫిబ్రవరి: మాస్టర్ డెవలప్‌మెంట్ ప్లాన్ నోటిఫై చేశారు.

2016 జూన్: ఏపీ సచివాలయం, ప్రభుత్వ విభాగాలు అమరావతి ప్రాంతం నుంచి పనిచేయడం ప్రారంభం.

2018 డిసెంబరు: సచివాలయ టవర్స్‌కు శంకుస్థాపన.

2019 ఫిబ్రవరి: హైకోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన.

2019 మే: వైసీపీ ప్రభుత్వంలో అమరావతిపై కుట్రలు ప్రారంభం.

2019 డిసెంబరు 17: వైసీపీ మూడు రాజధానుల ప్రకటన

2020 జూలై 31: సీఆర్‌డీఏ చట్టం రద్దు చేశారు. మూడు రాజధానుల బిల్లు పెట్టారు. శాసనమండలిలో టీడీపీ వ్యతిరేకించింది. అప్పటి మండలి చైర్మన్ మూడు రాజధానుల బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు.

2021 డిసెంబరు 13: న్యాయ వివాదాలతో మూడు రాజధానుల చట్టం ఉపసంహరించుకున్నారు. సీఆర్‌డీఏ చట్టం పునరుద్ధరణ.

2022 మార్చి 5: అమరావతిని ఏకైక రాజధానిగా అభివృద్ధి చేయాలని ఏపీ హైకోర్టు తీర్పు.

2024 జూన్ 2: పదేళ్ల ఉమ్మడి రాజధాని గడువు ముగిసింది. హైదరాబాద్ తెలంగాణకు పరిమితమైంది.

2025 మే 2: ప్రధాని మోదీ రాజధాని పనులను పునఃప్రారంభించారు.

2026 మార్చి 28: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతే ఉండాలని రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

2026 ఏప్రిల్ 1: రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర పునర్విభజన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

2026 ఏప్రిల్ 2: సదరు బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది.

## అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నెళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి.. నేడు పార్లమెంట్ సాక్షిగా అమరావతి అజేయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. అమరావతి ఇక అజేయమని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అమరావతి అభివృద్ధికి బలమైన తోడ్పాటు అందిస్తూ, చట్టబద్ధత బిల్లును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు'. ఈ చరిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పక్షాలు నిర్వహించే సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించి అమరావతి విజయోత్సవాన్ని జరుపుకోవాలి' అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ అనంతరం రాజ్యసభలోనూ బిల్లు నెగ్గడంతో రాజధానిగా అమరావతికి ఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆంధప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది.

# సాంఖ్యా యోగం విశిష్టత

**మంత్రాలయం ఏప్రిల్02 (నంది దినపత్రికప్రతినిధి)** భగవద్గీత లోని 18 అధ్యాయాలలో రెండవ అధ్యాయం సాంఖ్య యోగం అత్యంత కీలకమైనది. దీనిని గీతకు సారాంశం లేదా 'చిన్న గీత- అని పిలుస్తారు. యుద్ధ రంగంలో కుప్పకూలిపోయిన అర్జునుడికి, కృష్ణపరమాత్మ అందించిన అద్భుతమైన కౌన్సెలింగ్ ఇది. సాంఖ్య యోగంలోని ముఖ్యాంశాలను చాలా సరళంగా గమనించ వచ్చు.

1.దేహం వేరు - ఆత్మ వేరు (సాంఖ్యము) శ్రీకృష్ణుడు మొదటగా అర్జునుడికి చెప్పిన పాఠం నువ్వు ఎవరు? అని. మనం మన శరీరం అనుకుంటాం, కానీ మనం శరీరానివి కాము, మనలో ఉన్న ఆత్మలం. నిత్యత్వం: మనం ధరించే బట్టలు పాత వైపోతే ఎలా మార్చేస్తామో, ఆత్మ కూడా పాతబడిన శరీరాన్ని వదిలి కొత్త శరీరాన్ని ధరిస్తుంది. నాశనం లేనిది: ఆత్మను ఆయుధాలు చంప లేవు, అగ్ని కాల్చలేదు, నీరు తడపలేదు, గాలి ఆర్పలేదు. **సందేశం:** మరణం అనేది కేవలం శరీరానికి మాత్రమే, లోపల ఉన్న చైతన్యానికి కాదు. కాబట్టి అనవసరమైన భయాన్ని, శోకాన్ని వదిలి వేయాలి. 2.స్వధర్మంబాధ్యత) అర్జునుడు నేను యుద్ధం చేయను, అడవులకు వెళ్లి పోతాను అంటే, కృష్ణుడు స్వధర్మం గురించి వివరిస్తాడు.నువ్వు పుట్టిన కులానికి లేదా చేసే వృత్తికి ఒకగౌరవం, బాధ్యత ఉంటుంది. క్షత్రియుడిగా అధర్మాన్ని ఎదిరించడం నీబాధ్యత. బాధ్యత నుండి పారిపోవడం మోక్షం కాదు, అది పిరికితనం. ఫలితం ఏదైనా సరే, నీపనిని నువ్వు నిక్కచ్చిగా చేయడమే అసలైన ధర్మం. 3.నిష్కామ కర్మ (కర్మ యోగం) సాంఖ్య యోగంలో అన్నిటికంటే ప్రసిద్ధమైన శ్లోకం."కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన" దీని అర్థం చాలా సింపుల్: పని చేయడం మీవంతు, ఫలితం మీ చేతుల్లో లేదు.మనం ఫలితం గురించి అతిగా ఆలోచిస్తే భయం, ఒత్తిడి మొదలు అవుతాయి. అదే ఫలితాన్ని దేవుడికి వదిలేసి, పని మీద దృష్టి పెడితే ఆ పని అద్భుతంగా వస్తుంది.విజయం వచ్చినా, అపజయం వచ్చినా సమానంగా స్వీకరించడమే సమత్వం, ఇదే అసలైన యోగం.

4.స్థితప్రజ్ఞుడు (నిలకడైన బుద్ధి) అర్జునుడు ఒక చక్కని ప్రశ్న అడుగుతాడు: స్వామీ! బుద్ధి స్థిరంగా ఉన్నవాడు ఎలా ఉంటాడు? ఎలా మాట్లాడతాడు? దానికి కృష్ణుడు ఇచ్చిన వివరణే ఈ అధ్యాయానికి హైలైట్.

**కోరికల నియంత్రణ:** సముద్రంలో ఎన్నినదులు కలిసినా అదిఎలాపొంగిపోదో, స్థితప్రజ్ఞుడు కూడా ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని సుఖాలు వచ్చినా చలించడు.

**ఇంద్రియ నిగ్రహం:** తాబేలు తన అవయవాలను లోపలికి ఎలా ముడుచుకుంటుందో, మనంకూడా మన ఇంద్రియాలు కళ్లు, చెవులు, మనస్సు అనవసరమైన విషయాల వైపు వెళ్ళ కుండా అదుపులో ఉంచుకోవాలి. పతనం ఎలా జరుగుతుంది? ఒక విషయం మీద అతిగా ఆశ పెంచుకుంటే అది కామంగా మారుతుంది, అది తీరకపోతే కోపం వస్తుంది, కోపం వల్ల మతిమరుపు (భ్రమ) కలుగుతుంది, తద్వారా మనిషి విచక్షణ కోల్పోయి నాశనమౌతాడు. సాంఖ్య యోగం మనకు నేర్పే మూడు పాఠాలు:భయం వద్దు. నువ్వు ఆత్మవు, నీకు చావులేదు. ధైర్యంగా ఉండు.

**పని చెయ్యి:** ఫలితం గురించి ఆశించకుండా నీబాధ్యతను



నువ్వు నిర్వర్తించు.శాంతంగా ఉండు.గెలుపు ఓటములను సమానంగా చూడు. బుద్ధిని స్థిరంగా ఉంచుకో. ఈరెండో అధ్యాయాన్ని అర్థం చేసుకుంటే, జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా మనం కృంగిపోం. ఇదే భగవద్గీత మనకు ఇచ్చే గొప్ప మానసిక బలం.

# మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





## మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం
## సమస్యల పరిష్కారానికి డీఈఓకు ఆదేశం

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 02 ( నంది పత్రిక )** నంద్యాల స్థానిక ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్‌ను రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి స్వయంగా భోజనం చేసిన మంత్రి ఫరూక్ , విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఈరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్డు వడ్డించకపోవడాన్ని గమనించిన ఆయన, భోజన నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా వస్తున్న నీరు ఉప్పగా ఉండటంతో విద్యార్థులు తాగడానికి ఇబ్బంది పడుతున్నట్లు మంత్రి ఫరూక్ దృష్టికి వచ్చింది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చాలా కాలంగా స్లాప్ లెవల్‌లో ఆగిపోయిన నిర్మాణ పనుల వల్ల, అక్కడ ఉన్న కట్టెలు ఎప్పుడు పడతాయోనని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు మరియు సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై మంత్రి ఫరూక్ వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో లోపాలు, తాగునీరు మరియు భవన నిర్మాణ సమస్యలను వివరించి, యుద్ధ ప్రాతిపదికన వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాల తనిఖీ అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం మెరుగైన పోషకాహారాన్ని అందిస్తోందని . మెనూ ప్రకారం గుడ్డు ఇవ్వకపోవడం సరికాదని విద్యార్థులకు పెట్టే భోజనం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నిర్లక్ష్యం వహించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా విద్యార్థులకు ఉప్పు నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మా బాధ్యత. వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని . ఆగిపోయిన స్లాప్ పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రమాదకరంగా ఉన్న కట్టెలను తొలగించాలని అధికారులను ఆదేశించారు . ఉపాధ్యా యులు సమయపాలన పాటించాలని . విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, వారికి నాణ్యమైన విద్య అందేలా చూడాలని . జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పాఠశాలలోని ప్రతి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు





# స్పెషల్ ఆఫీసర్ గా తహసిల్దార్ పద్మావతమ్మ

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 2:** గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం గురువారం నాడు ముగిసింది. వీరి స్థానంలో పంచాయతీలలో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు పరిశీలించేందుకు మండల స్థాయిలోని అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బండి ఆత్మకూరు మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం జరిగింది. ఒక్కొక్క అధికారికి అదనంగా మరో రెండు పంచాయతీలకు కూడా వీరికి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బండి ఆత్మకూరు గ్రామపంచాయతీకి స్పెషల్ ఆఫీసర్ గా తాసిల్దార్ పద్మావతమ్మను నియమించారు. బండి ఆత్మకూర్ తో పాటు రామాపురం సంత జుటూరు గ్రామపంచాయతీలకు కూడా పద్మావతమ్మ స్పెషల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తారు. ఎంపీడీవో గాయత్రి కడమల కాలువ, ఈర్నపాడు, సంత జుటూరు గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ గా నియమించారు. బండి ఆత్మకూరు పశువైద్యాధికారి అనూషకు ఎర్రగుంట్ల, ఏ కోడూరు గ్రామపంచాయతీలు, పార్నపల్లి పశువైద్యాధికారి జోష్ణ కు పార్నపల్లె, కాకనూరు, డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తంకు లింగాపురం, చిన్నదేవలాపురం, నారాయణపురం గ్రామపంచాయతీలు, మరో డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళికి వెంగళ్రెడ్డిపేట, గాలి చెన్నయ్యపాలెం, వ్యవసాయ అధికారి పవన్ కుమార్ కు పరమటూరు, భోజనం, పెద్దదేవలాపురం, మండల విద్యాశాఖ అధికారి యశోదకు సింగవరం, సోమయాజుల పల్లె, గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకనుండి స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో పంచాయతీలలో అభివృద్ధి పనులు జరగనున్నాయి.

**ఐదు నెలలుగా అభివృద్ధి లేని పంచాయతీలు**

బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు, కడమల కాలువ గ్రామపంచాయతీలలో ఐదు నెలలుగా అభివృద్ధి పనులు జరగడంలేదని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామపంచాయతీలకు గతంలో కార్యదర్శులుగా పనిచేసినవారు పదోన్నతులు పొంది ఇతర గ్రామపంచాయతీలకు బదిలీ అయ్యారు. ఈ కారణంగా రెండు గ్రామ పంచాయతీలకు పక్క గ్రామాలలో పనిచేస్తున్న కార్యదర్శులను ఇన్చార్జులుగా నియమిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు గ్రామాలలో జిల్లా అధికారులు నిర్దేశించిన మేరకు ఇంటి పన్ను, కొళాయి పనుల విషయంలోనే అధికారులు శ్రద్ధ వహించారు. గ్రామాభివృద్ధి విషయంలో అధికారులు పట్టించుకోలేదని గ్రామ ప్రజల నుండి ఆందోళన వ్యక్తం అవుతూ ఉంది. ఈ నేపథ్యంలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో రెండు గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్ గా ఎంపీడీవో ఎ గాయత్రిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు గ్రామాలతో పాటు బి కోడూరు గ్రామానికి కూడా ఎంపీడీవో స్పెషల్ ఆఫీసర్ గా వ్యవహరించాల్సి ఉంది. ఈర్నపాడు కడమల కాలువ గ్రామాలు సమస్యాత్మక గ్రామాలు కావడంతో ఇక్కడ స్పెషలాఫీసర్ గా పని చేయాలంటే సాధ్యమైన విషయమే.



## ప్రభుత్వాలు దేవాలయ మాన్యములకు కాపలాధారే తప్ప హక్కుదారు కాదు



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 2 ( నంది పత్రిక )** బనగానపల్లి మండలం భానుముక్కల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ దేవాలయానికి చెందిన దాదాపు 35 ఎకరాల మాన్యమును ప్రజలకు పంచిపెట్టే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుగా గౌరవనీయ మంత్రివర్యులు దీజ జనార్ధన్ రెడ్డి గారి యొక్క మాటలు స్పష్టం చేస్తున్నాయి, ఈ భూముల పంపిణీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్ గారు మాట్లాడుతూ..... పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వటం విశ్వ హిందూ పరిషత్ స్వాగతిస్తుంది. అయితే అవి దేవాలయ మాన్యాలు ఇస్తే కచ్చితంగా ఖండిస్తుంది.అవసరమైతే ప్రజా పోరాటం,న్యాయపోరాటం చేయడానికి సిద్ధం అని తెలిపారు. ఈ దేవాలయ భూముల పంపిణీ విషయంలో విశ్వ హిందూ పరిషత్ అభ్యంతరాలను కలెక్టర్ గారికి, ఎండోమెంట్ డీఈవో గారికి వినతిపత్రంతో తెలియజేస్తామని తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విధంగా దేవాలయ మాన్యాలను పంచుకుంటూ, ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చుకుంటూ వెళితే ఏదో ఒక రోజున దేవాలయ వ్యవస్థ కుంటుపడటం తప్పదు దేవాలయ వ్యవస్థ యధాతరంగా ఉండాలంటే ఆ యొక్క మాన్యముల పరిరక్షణ పకడ్బందీగా ఉండాలి. అంతేగాని ప్రభుత్వ అవసరాలకు దేవుడి విలువైన మాన్యాలను ఇవ్వడం సరైనది కాదని తెలిపారు.దేవాలయ భూములను రక్షించాల్సిన ప్రభుత్వాలే ఈ విధంగా దేవాలయ భూములను ఇవ్వడం సరైనది కాదన్నారు. నంద్యాల జిల్లా విశేష సంపర్క ప్రముఖ కాల్వ శేష సాయి గారు మాట్లాడుతూ గతంలో దేవాలయ భూములను ఈ విధంగా అన్యాక్రాంతం చేయాలని చూస్తే ఇది తప్పు అని కోర్టు తీర్పులు కూడా వచ్చాయి అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి గారు పాల్గొన్నారు.



## ప్రజానాట్యమండలి జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ఇంచార్జ్ జగన్నాథం



**కర్నూలు నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగినది ఈ సమావేశం వెంకటరాముడు అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ఇన్చార్జ్ అయినా కె. జగన్నాధం హాజరయ్యారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజానాట్యమండలి కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే కొత్త కొత్త కళారూపాలు ఏర్పాటు చేసుకొని ప్రజల్లోకి పోవాలి అని జిల్లా సమావేశంలో ఆయన తెలియపరిచినారు ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వి. నాగరాజు మాట్లాడుతూ మహానందిలో జరిగిన ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర కౌన్సిలలో జరిగినా నిర్ణయాలు ప్రస్తావించినారు ఈ రాష్ట్రంలో నాలుగు ప్రాంతాలలో కోస్తా ఉత్తరాంధ్ర ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో కోస్తా ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లా సమావేశాలు జరుగుతున్నాయని మాట్లాడినారు ప్రజానాట్యమండలి నిర్మాణం గురించి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వివిధ నియోజకవర్గాలలో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు దాంట్లోఈ మూడు నియోజకవర్గాలలో ఈ నెల 9వ తేదీన పత్తికొండలో 12వ తేదీన ఆదోనిలో 16వ తేదీన ఆస్పరిలో ఈ మూడు ప్రాంతాలలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా కౌన్సిల్ తీర్మానం చేసినది ఆ నియోజకవర్గాలలో సిపిఐ పార్టీ నాయకులు సహాయ సహకారాలు అందించాలి. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలు జూన్ జూలైలో పత్తికొండ లేదా కర్నూల్ లో ఈ రెండు ప్రాంతాలలో చేయాలని తీర్మానించినారు తిరుపతిలో జరుగుతున్న ఏపీ ప్రజానాట్యమండలి సమావేశాలకి కర్నూలు జిల్లా నుండి 20 మంది హాజరుకావాలని నిర్ణయించినారు కర్నూలు జిల్లా హరసంలో ఏపీ ప్రజానాట్యమండలి ఈ నెలాఖరు లోపల సమావేశం ఏర్పాటు చేయాలని సంఘం ఇన్చార్జి కే జగన్నాథం కోరారు ఈ తీర్మానాలపై జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగినది ఈ తీర్మానాలన్నిటికి పార్టీ జిల్లా నాయకులు నియోజకవర్గ నాయకులు సహకరించాలని ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. నాగరాజు కోరారు

## పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



**కొత్తపల్లి - నంది పత్రిక:** మండలంలోని బట్టువారి పల్లి గ్రామము నందు గురువారం గ్రామ సభనిర్వహించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్ భాగంగా రీ సర్వే పూర్తి అయిన తరువాత రైతులకు అందరికి పట్టాదారు పాసు పుస్తకాలను తహసీల్దార్ ఉమారాణి ఆద్వర్యంలో పంపిణీ జరిగింది. రైతులు పట్టాదారు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆమె సూచించారు. అదేవిధగా వాటిలో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వినర్ లింగస్వామి గౌడ్ ,రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దన్న, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాబుమియ్య. రెవిన్యూ అధికారి బి శ్రీనివాసులు, గ్రామ సర్వేయర్ బాలర్షి. గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మాస్టర్స్ క్రీడల్లో రాణించిన కర్నూలు పోలీసు క్రీడాకారులు

**విజేతలైన పోలీసు క్రీడాకారులను అభినందించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**

**కర్నూలు .నందిపత్రిక . ఏప్రిల్ 01:** ఆంధ్రప్రదేశ్ శాప్ (యస్ ఏ పి ) లీగ్ మాస్టర్స్ క్రీడలలో పాల్గొని బంగారు, వెండి, కాంస్యం పతకాలు సాధించిన ఆర్ ఎస్సై, కానిస్టేబుల్ ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ అభినందించారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటిలో మార్చి 30, 31 తేదిలలో 35 నుండి 45 ఏళ్ళ వయస్సు విభాగంలో ఈ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటిలలో ఆర్ ఎస్సై పి.ఆర్ మహేశ్వరెడ్డి, కానిస్టేబుల్ శివకుమార్ లు పతకాలు సాధించారు. ఈ సంధర్బంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విజేతలైన పోలీసు క్రీడాకారులు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు ఎస్పీ మెడల్స్ మరియు శాలువతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలీసు విధులలో ఒత్తిడితో ఉంటూ క్రీడలలో కూడా రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆకాంక్షించారు. ఆర్ ఎస్సై పి.ఆర్ మహేశ్వర రెడ్డి గుంటూరు ఆచార్యయూనివర్సిటిలో 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించారు.గత 5 సంవత్సరాలుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ లలో పాల్గొంటూ , చెన్నై నేషనల్ మీట్ లలో కూడా ప్రతిభ చూపారు. కానిస్టేబుల్ శివకుమార్ ..(కర్నూలు ట్రాఫిక్ పియస్) గుంటూరు ఆచార్య యూనివర్సిటీలో లాంగ్ జంప్ లో క్యాంస పతకం సాధించారు. గతంలో సౌత్ జోన్ నేషనల్స్, కేరళ జూనియర్స్ నేషనల్ , రాష్ట్ర మరియు జిల్లా స్థాయి లాంగ్ జంప్ పోటీలలో కూడ ప్రతిభ చూపారు. వీరిద్దరూ జాతీయ స్థాయి క్రీడలలో కూడా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆర్ ఐ జావేద్, మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, సెక్రటరీ రవికుమార్ ఉన్నారు.

# కార్డియోస్ స్లీవ్ వ్యాలిడేషన్ పరీక్షలు విజయవంతం

**కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిండెంట్ కె.వెంకటేశ్వర్లు**



**కర్నూలు నందిపత్రిక** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా ముగిసిన 'రిజువెన్ మెడికేర్' ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ ) వ్యాలిడేషన్ పరీక్షలు ముగిశాయి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మరియు ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ (ఐ .ఏ .యస్ ) మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మరియు రాష్ట్ర ఆరోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఛాలెంజ్' లో దేశవ్యాప్తంగా వచ్చిన 300 దరఖాస్తులలో 18 వినూత్న కంపెనీలను ఎంపిక చేయడం జరిగింది. ఆ జాబితాలో చోటు దక్కించుకున్న 'రిజువెన్ మెడికేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు తమ 'కార్డియో స్లీవ్' పరికరం యొక్క పనితీరును కర్నూలు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో పరీక్షించే అవకాశం లభించింది.

ఈ 'కార్డియో స్లీవ్' పరికరం కేవలం 30 సెకన్లలోనే గుండె వైఫల్యాలను (హార్ట్ ఫెయిల్యూర్ ) గుర్తించి తక్షణ నివేదికలను అందిస్తుంది

**ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ :-**

"రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో మా ఆసుపత్రిలో జరిగిన 'కార్డియో స్లీవ్' వ్యాలిడేషన్ పరీక్షలు అత్యంత విజయవంతంగా పూర్తయ్యాయి అన్నారు. కేవలం 30 సెకన్లలోనే గుండె సమస్యలను 93% ఖచ్చితత్వంతో గుర్తించడం నిజంగా అద్భుతం అన్నారు. ఇటువంటి అత్యాధునిక ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల సామాన్య రోగులకు అత్యవసర సమయాల్లో వేగవంతమైన వైద్య సేవలు అందుతాయని హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తో పాటు కార్డియాలజీ అసోసియట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ ,అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె రవి కిరణ్ , రిజువెన్ మెడికేర్ ప్రతినిధులు బాలాజీ లంక, ఉమా మహేష్ కట్టా మరియు కుమారి శాంతి పచ్చిపాల పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 02(నంది పత్రిక):-** నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగంతో పాటు ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ (ఓపీ), రిజిస్ట్రేషన్ బ్లాక్, మెడికల్ ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రత, సమయపాలన, సేవల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేసారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం ప్రతి వైద్యుడి బాధ్యత అని సూచించారు. అలాగే, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలను మరింత మెరుగుపరచాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



# ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించాలి





**రైతులకు నీటి నిర్వహణ, పోషక లోపాలపై అవగాహన అత్యవసరం**

**ఉద్యాన పంటల పెంపుతో జిల్లాకు ఆర్థిక వృద్ధి సాధ్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 02(నంది పత్రిక):-** జిల్లాలో ఉద్యాన పంటలను విస్తృతంగా పెంపొందించడం ద్వారా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ను పెంచే అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న బి9 గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కన్వర్జెన్స్ విభాగాల సమన్వయ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో ఇప్పటికే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రాబోయే మే, జూన్ నెలల్లో మరింత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భూమి సారాన్ని కాపాడుకోవడం, లాభదాయకమైన పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించడం అవసరమన్నారు.

**ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ ప్రాముఖ్యం** పీఎండీఎస్ విధానం ద్వారా భూమిని ఏడాది పొడవునా పంటలతో కప్పి ఉంచవచ్చని, ఇది ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రైతులు ఈ విధానాన్ని విస్తృతంగా అనుసరించి, అందుబాటులో ఉన్న పీఎండీఎస్ కిట్లను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

**ప్రకృతి వ్యవసాయం – అదనపు ఆదాయానికి మార్గం**

పొలాల గట్లను వెడల్పుగా తయారు చేసి వాటిపై కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఖర్చులు తగ్గడంతో పాటు, పంటల నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై దృష్టి**

జిల్లాలో నైట్రోజన్ లోపం ఉండగా, ఫాస్పరస్ అధికంగా ఉండటం, జింక్, సల్ఫర్ తక్కువగా ఉండటం గమనార్హమని తెలిపారు. అందువల్ల రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అవసరమైన పోషకాలను గుర్తించి, యూరియా, డీఏపీపై ఆధారపడకుండా కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని సూచించారు.

**నీటి వినియోగంలో సమర్థత అవసరం**

నీటి లభ్యత పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి ఉద్యాన పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యాన పంటల విస్తరణలో జిల్లా అధికారులు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు.

**అధికారుల సమన్వయం కీలకం**

వ్యవసాయ, ఉద్యాన, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరవేయాలని కలెక్టర్ సూచించారు. అధికారులు తమ పరిజ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకుంటూ, రైతులకు మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతి బిల్లు ఆమోదంపై హర్షం

**మర్రిపాడు ఏప్రిల్ 04నంది పత్రిక :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రతిపాదిస్తూ ప్రవేశపెట్టబడిన బిల్లు పార్లమెంటు లో ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మర్రిపాడు ఉన్నత పాఠశాల,కస్తూరిబా గాంధీ విద్యాలయం లలో సంబరాలు జరుపుకున్నారు. మర్రిపాడు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య,ధనలక్ష్మి పాల్గొని విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# పిచకారీ మందు చేత పట్టి... దోమల భరతం పట్టే..

**అధికారం ఉన్నా లేకున్నా ప్రజలకు అనునిత్యం అందుబాటులో..**

**దోమల బెడదకు శాశ్వత పరిష్కార దిశగా వైసీపీ లీడర్ అక్కలరెడ్డి నారాయణ రెడ్డి.**

**నెల్లూరు ఏప్రిల్ 2 నంది పత్రిక :** తమ పార్టీ అధికారంలో ఉన్న.. లేకున్నా..ప్రజలకు కష్టం వచ్చిందని తమ దృష్టికి వచ్చిన వెంటనే ప్రజలకు అండదండ అన్ని తామై తోడుగా ఉంటూ వారి యొక్క కష్టనష్టాల్లో అనునిత్యం వెంటే నడుస్తూ సమస్యలకు సత్వర పరిష్కార దశగా అడుగులు వేస్తున్న ఏకైక ప్రభుత్వం ఏదైనా ఉందంటే వైసీపీ అని చెప్పుకోవడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. వివరాల్లోకి వెళితే నెల్లూరు సిటీ పరిధిలోని మూడవ డివిజన్ కిసాన్ నగర్ పరిధిలో సైడ్ కాలువల లో మురికి నీరు చేరి..ఆ చేరిన మురికి నీరు పై దోమలు తారా స్థాయిలో విజృంభిస్తూ ప్రజలను కుడుతూ అనునిత్యం ఏదో ఒక అనారోగ్య సమస్యతో అస్తవ్యస్తం అవుతూ ప్రతినిత్యం హాస్పిటల్ల చుట్టూ తిరుగుయాడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజల యొక్క దీనస్థితిని చుసిన నెల్లూరు నగర వైసిపి ఇన్చార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మూడవ డివిజన్ వైసీపీ ఇన్చార్జి అక్కల రెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దోమల పిచికారి మందును ప్రతి కాలువలో స్ప్రే చేయడం జరిగింది . ఈ విధంగా ప్రతిరోజు సాయంత్రం వేళలో తన పరిధిలోని ప్రతి ఏరియాలో ఉన్న ప్రతి కాలువలో దోమల పిచికారి మందు స్ప్రే చేసి ప్రజలకు దోమల వల్ల వచ్చే వ్యాధులను అరికట్టే దిశగా ఈ ప్రయత్నం చేయడం జరుగుతుందని.. అదేవిధంగా తమ యొక్క ప్రభుత్వం అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేసే మంచి మనసున్న వ్యక్తి నగర వైసీపీ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల తో 3వ డివిజన్ వైసిపి ఇన్చార్జ్ అక్కల రెడ్డి నారాయణ రెడ్డి ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండే దిశగా సూచనలు ప్రకారం తాము అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ముగిసిన పది పరీక్షలు

**కొత్తపల్లి – నంది పత్రిక:** మార్చి నెల 16 వ తేది నుంచి నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు ఇంగ్లీష్ పరీక్షకు విద్యార్థులు హాజరై ప్రశాంతంగా పరీక్షరాశారు. కొత్తపల్లి పరీక్షా కేంద్రంలో 158 మందికి గాను 158 మంది విద్యార్థులు, గోకవరం పరీక్షా కేంద్రంలో 91 మంది విద్యార్థులకు గాను 86 మంది హాజరు కాగా 5 మంది విద్యార్థులు గైహాజరు అయ్యారు. చీఫ్ ఎగ్జామినర్లు సుబ్బారెడ్డి, వెంకటస్వామిలు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. చివరిరోజు పరీక్షలు పూర్తికాగానే వెంటనే విద్యార్థులు ఆనందంతో బయటి వచ్చారు.పోలీస్ అధికారిని అవుతా. విరేఖ. గుమ్మడాపురం గ్రామం, కేజీబివి పాఠశాల విద్యార్థిణి నాది చిన్నగుమ్మడాపురం గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. పది పరీక్షలు పూర్తి అయ్యాయి. నేను బాగా రాశాను, 500 మార్కులు పైనే వస్తాయని ఆశపడుతున్నా. నేను భవిష్యత్తులో పెద్ద పోలీస్ అధికారి అవ్వలనుకుంటున్నా. పోలీస్ అధికారి అయి సమాజంలో జరుగుతున్న సమస్యలను రూపు మాపేందుకు కృషి చేస్తా. ఆర్మీలో చేరి దేశసేవ చేస్తా..... అరవింద్, పాలెంచెరువు, ఆశ్రమపాఠశాల' విద్యార్థి

## రాంకో సిమెంట్ పరిశ్రమ వలన భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి




**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 02 . (నంది పత్రిక ):** కొలిమిగుండ్ల మండలం లోని రాంకో సిమెంట్ పరిశ్రమ వలన భూములు కోల్పోయి.. దుమ్ము ధూళి వలన పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని స్థానిక జిల్లా ఎస్పీకి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు ఏ సుబ్బారెడ్డి రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె భాస్కర్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి పుల్లన్న పాల్గొన్నారు.రాంకో సిమెంట్ పరిశ్రమ బాధిత రైతుల డిమాండ్స్. 1) రాంకో సిమెంట్ పరిశ్రమ కాలుష్యముతో ఐదు సంవత్సరములుగా పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి. 2) భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ. ఉపాధి.కల్పించాలి. 3) సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రైతుల నుండి కొనుగోలు, చేసిన బీడు భూములుగా ఉన్న వాటిని రైతులకు సాగు చేసుకునేలా అనుమతించాలి. 4) జీవో 291 ప్రకారం 75% స్థానికులకు సిమెంట్ పరిశ్రమలో ఉద్యోగాలు, ఉపాధి,కల్పించాలి.5) 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు 20 సంవత్సరములు ఆర్థిక సహాయం కంపెనీలు అందించాలి.అని పలు డిమాండ్లతో కూడిన మెమోరాండం ఇవ్వడం జరిగింది.

## భోజనం లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ



**బండిఆత్మకూరు నందిపత్రిక ఏప్రిల్ 2:** బండిఆత్మకూరు మండల పరిధిలో ఉన్న భోజనం గ్రామంలో గురువారం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.తహసీల్దారు పద్మావతమ్మ గ్రామంలో రైతులతో కూడిన గ్రామ సభను నిర్వహించారు.మొత్తం 933 పాసు పుస్తకాలకు గాను 703 మంది రైతులకు పుస్తకాలను పంపిణీ చేశారు.180 పాసు పుస్తకాలు జాయింట్ ఎల్ పి ఏమ్ లో ఉన్నాయని వాటిని తొలగించిన తర్వాత ఇస్తామని,ఆరు డెత్ కేసులు ఉన్నాయని తహసీల్దార్ పేర్కొన్నారు.రీ సర్వే జరిగిన తర్వాత ఆన్ లైన్లో నమోదు చేసే సమయంలో పట్టా బదులుగా రైతువారి పట్టా అని తప్పుగా నమోదు అయిందని,వాటిని సరి చేసి మిగతా రైతులకు కూడా పాసు పుస్తకాలను అందజేస్తామని తహసీల్దారు పేర్కొన్నారు.సర్వీస్ ఇనామ్ భూములకు సంబంధించి కూడా కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని సవరించి మిగతా రైతులకు పాసు పుస్తకాలను అందజేస్తామని తహసీల్దార్ వివరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహులు,గ్రామ రెవిన్యూ కార్యదర్శులు మౌలాలి,నాగేశ్వరరావు,తిరుపాలు,గ్రామరైతులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**వెలుగోడు, ఏప్రిల్ 02 (నంది పత్రిక):** వెలుగోడు మండలంవేల్పనూరు గ్రామ పరిధిలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. ఉదయం సుమారు 9 గంటల సమయంలో వేల్పనూరు గ్రామం బయట జమ్ములమ్మ గుడి సమీపంలోని నిప్పులవాగు వద్ద, కే.ఎమ్.పవర్ ప్లాంట్ గేట్ల దగ్గర నీటిలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం బోర్ల పడి తేలియాడుతూ కనిపించింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామ వీఆర్వో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.వీఆర్వో ఫిర్యాదు మేరకు వెలుగోడు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు సుమారు 40 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నాడని పోలీసులు తెలిపారు. "వి ఎం టెక్స్" అనే పేరు గల నీలం రంగు ఫుల్ డ్రాయర్ తప్ప గుర్తించడానికి ఇతర ప్రత్యేక ఆనవాళ్లు లేవని ఆయన తెలిపారు. అలాగే శరీరంపై ఎటువంటి గాయాలు ఆనవాళ్లు కూడా కనిపించలేదని చెప్పారు.మృతుడి వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదని, ఎవరికైనా ఈ వ్యక్తి గురించి సమాచారం తెలిసిన పక్షంలో వెలుగోడు పోలీస్ స్టేషన్ ఎస్సై 9121101183 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

# జీరో వేస్ట్ కార్యక్రమాన్ని వసతి గృహాలు, పాఠశాలలు, హాస్టల్స్‌లో సమర్థవంతంగా అమలు చేయాలి





### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2 నంది పత్రిక** వ్యర్థాలను (చెత్తను) సాధ్యమైనంత వరకు తగ్గించడం, పునర్వినియోగం చేయడం మరియు శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం కోసం ఉత్తమ ప్రణాళికలను వసతి గృహాలు, పాఠశాలలు మరియు హాస్టల్స్‌లో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి సంబంధిత యాజమాన్యాలకు ఆదేశించారు. కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ “జీరో వేస్ట్ ఇనిషియేటివ్” కార్యక్రమంపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గాలి, నీటి వనరులు మరియు ఆహార పదార్థాలు కలుషితం అవుతున్న నేపథ్యంలో ప్రజలు వివిధ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితులను నియంత్రించకపోతే భవిష్యత్ తరాలకు తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రత మరియు కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తడి చెత్త మరియు పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, భవిష్యత్తులో చెత్త నిర్వహణ పెద్ద సమస్యగా మారే అవకాశం ఉన్నందున పాఠశాలలు మరియు కళాశాలల్లో ‘జీరో వేస్ట్’పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే వసతి గృహాలు, కళాశాల హాస్టల్స్ మరియు విద్యాసంస్థలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో కంపోస్ట్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**వసతి గృహాలలో హాజరు శాతం పెంపు విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి** జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతి గృహాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు మరియు వసతి గృహాలలో విద్యార్థులు చదువును మధ్యలో మానివేయకుండా (డ్రాపౌట్స్ లేకుండా) ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, వసతి గృహాలలో అందిస్తున్న మౌలిక సదుపాయాలపై తల్లిదండ్రులకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, పరీక్షలు, చదువులో వెనుకబాటుతనం, సబ్జెక్టులపై పట్టు లేకపోవడం వంటి కారణాల వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, లక్ష్య నిర్దేశం, వాటి సాధనకు అవసరమైన కృషి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్యాంసుందర్, డిఐఓ ప్రభాకరరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి.అరుణ కుమారి, బీసీ సంక్షేమ అధికారి ఎ.వి. సూరిబాబు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ బి. రాజారావు, ఎం.సత్యప్రసాద్, టి. సాంబమూర్తి, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్ కె. మౌనిక, దాదా గజిని, జి.సూర్యకుమారి, ఎం.పద్మ, డాక్టర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భూసారం పెంపుకు నవధాన్యాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి






### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2నంది పత్రిక** భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో రైతు సాధికార సంస్థ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన ముందస్తు చర్యలపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, నిపుణులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నవధాన్య కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రతి రైతు తమ పంట పొలాల్లో నవధాన్యాలు ద్వారా పశువులకు పచ్చి రొట్టె సాగు చేయడం ద్వారా భూసారం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా మైక్రో న్యూట్రియంట్స్ పెరిగి భూమి సారవంతంగా మారుతుందని వివరించారు. ఆరోగ్యవంతమైన భూమి ద్వారా మంచి దిగుబడులు లభిస్తాయని, తద్వారా ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ విషయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. గత సంవత్సరంలో అమలు చేసిన కార్యక్రమాల అనుభవాలను విశ్లేషించి, ఈ సంవత్సరం మరింత మెరుగైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ( ఎఫ్ పి ఓ ఎస్ ) కీలక పాత్ర పోషించాలని, వాటి ద్వారా ఉత్పత్తిని పెంచి రైతులకు మెరుగైన ఆదాయం అందించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతూ రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. రసాయన వ్యవసాయాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో జీవామృతం, అగ్ని అస్త్రం, ఎగ్ అమినో యాసిడ్ వంటి సహజ ఇన్‌పుట్స్ తయారీ, బయో కల్చర్స్ ఉత్పత్తి మరియు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నవధాన్య కిట్ల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు, స్వయం సహాయక సంఘాల ద్వారా సీడ్ కిట్ల తయారీ మరియు పంపిణీకి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అందించే స్థిరమైన వ్యవసాయ విధానమని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించడం, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. రైతులకు విత్తనాల పంపిణీ, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ మరియు ఇంటర్‌క్రాపింగ్ విధానాల అమలు, ప్రతి డివిజన్‌కు ఒక రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.సహదేవరెడ్డి ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై చూపే ప్రభావాలు, ఆ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున రావు మాట్లాడుతూ వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, తక్కువ నీటితో సాగు చేసే పంటలు, అనువైన విత్తనాల వినియోగంపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంలో గుడ్ల కొరతపై మంత్రి ఫరూక్ సీరియస్



### వెంటనే స్పందించి గుడ్లు సరఫరా చేసిన అధికారులు

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 02 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం అందరికీ తెలిసిందే . పాఠశాలలోని వసతులను, విద్యా బోధనను పరిశీలించిన మంత్రి ఫరూక్ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించగా, మెనూ ప్రకారం ఉండాల్సిన గుడ్లు లేకపోవడాన్ని మంత్రి ఫరూక్ గమనించారు. దీనిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని హెచ్చరించారు. వెంటనే మంత్రి ఫరూక్ సంబంధిత విద్యాశాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి, గుడ్ల పంపిణీలో జరుగుతున్న లోపాలను ప్రశ్నించారు. మంత్రి ఫరూక్ ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు గంటల వ్యవధిలోనే స్పందించి నంద్యాల డీఈవో జనార్దన్ రెడ్డి, ఎంఈఓ బ్రహ్మం నాయక్ పాఠశాలకు అవసరమైన గుడ్ల నిల్వలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని . మధ్యాహ్న భోజనం విషయంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదని. ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి అని ఆదేశించారు.






# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజా సమస్యల సత్వర పరిష్కారం.

### మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



**కేసముద్రం, ఏప్రిల్ 02(నంది పత్రిక):**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రంలో మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా వార్డ్ సభ కార్యక్రమం నిర్వహించగా జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వార్డు కౌన్సిలర్ లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ని ఉద్దేశించి మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ముఖ్య లక్ష్యమన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రజలకు తెలిపారు. మున్సిపాలిటీని అభివృద్ధి కోసం ముఖ్యంగా: తాగునీటి సౌకర్యాల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, పేద ప్రజలకు సంక్షేమ పథకాల అమలు, ఆరోగ్యం, విద్య రంగాల్లో మెరుగుదల ఇవి అన్నీ 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో ముఖ్య అంశాలుగా తెలిపారు. ప్రతి ఒక్కరి సమస్యను వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. అందరం కలిసి పని చేస్తే కేసముద్రం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు వేముల భారతి, వల్లందాస్ ఉమా, కనుకుల సుభద్ర, మేకల శారద, రావుల వినయ్ రెడ్డి, అధికారులు, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

# సప్పిడిగుట్ట జిపి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మార్కెట్ చైర్మన్.



**కేసముద్రం, ఏప్రిల్ 02(నంది పత్రిక):**కేసముద్రం మండలం సప్పిడి గుట్ట గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సర్పంచ్ బానోతు భద్రునాయక్, ఉప సర్పంచ్, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.20 లక్షల నిధులను మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మంజూరు చేశారని, గ్రామ పంచాయతీ భవన నిర్మాణము త్వరగా పూర్తి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల ప్రణాళికలతో ముందుకు పోతున్న ప్రభుత్వాన్ని ఆదరించి పల్లెలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, కూరెల్లి సతీష్, ఉప సర్పంచ్ భానోత్ రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిదురాల వసంతరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వినయ్, పిఆర్ ఏఈ విద్యాసాగర్, గ్రామ అధ్యక్షులు బానోతు వాలు, జాటోత్ బిక్షపతి, బానోత్ శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ బానోత్ రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, బానోత్ నంద తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికతనిఖీ :

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల చివరి రోజు సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి భీమవరం పట్టణంలోని చిన్నరంగడిపాలెం మున్సిపల్ హై స్కూల్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, కేంద్రంలో అమలవుతున్న నియమాలు, పర్యవేక్షణ చర్యలను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షా హాల్స్‌లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా జరుగుతున్నాయా అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, నిబద్ధతతో మరియు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైనవని, ఈ దశలో సాధించిన ఫలితాలు వారి విద్యా మరియు వృత్తి మార్గాన్ని నిర్ణయించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా ముగియడం ఆనందకరమని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు పోలీస్ శాఖ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు. వారి సమన్వయం మరియు కృషి వల్లే పరీక్షలు సజావుగా జరిగాయని ప్రశంసించారు.



# ప్రజారాజధానిగా అమరావతి

**- అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**- రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టం**

**- 1600 రోజుల పోరాటం రైతులు, మహిళల దీక్షకు గౌరవం**

**- మూడు రాజధానుల గందరగోళం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిన గత పాలన**

**- సీఎం చంద్రబాబు దూరదృష్టి ప్రపంచ స్థాయి అమరావతి నిర్మాణం**

**- పీఎం మోదీ సంకల్పం వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది**

**అమరావతి,బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2:నంది పత్రిక** అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజారాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు. 1600 రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు, మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ, ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు. గత 12 ఏళ్లుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతికి మద్దతు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఇది ఐదుకోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, రైతుల త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. రాజధానిపై ఎమ్మెల్యే జగన్ వక్రబుద్ధి ఎప్పటికీ మారదని, రాష్ట్రానికి న్యాయం చేస్తారనే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శిస్తూ, 'మావిగన్' వంటి ప్రతిపాదనలు ఆయన చంచల వైఖరికి నిదర్శనమని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం గత ప్రభుత్వ వైఫల్యాలకు గట్టి సమాధానంగా నిలిచిందని పేర్కొన్నారు. అమరావతి గ్రామాలైన తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి తదితర ప్రాంతాల్లో రైతులు, మహిళలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకోవడం ప్రజల ఆనందానికి నిదర్శనమని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి సువర్ణ భవిష్యత్ అందిస్తుందని, అమరావతి నిత్యశాశ్వత రాజధానిగా నిలుస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.



# ఘనంగా ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక గ్రామసభలు.







**ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేపించిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్.**

**దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం.**

**ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్.**

**గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి గ్రామసభ బలమైన వేదిక.**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**

**మహబూబాబాద్, ఏప్రిల్ 02(నంది పత్రిక):** గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా దంతాలపల్లి మండల కేంద్రం, పెద్ద ముప్పారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, గూడూరు మండల కేంద్రంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, కేసముద్రం మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మరిపెడ మండల కేంద్రాలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి గ్రామసభను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపీడీవో వినిపించగా, గ్రామ పంచాయతీ పూర్తి సమగ్ర నివేదికను పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అన్ని విభాగాల సిబ్బంది వారి వారి శాఖల ప్రగతి నివేదిక సభలో వివరించారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు వెల్లడించారు. జిల్లాలోని 18 మండలాలు, 5 మున్సిపాలిటీలు, 98 వార్డుల ప్రత్యేక అధికారులు, 482 గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అన్ని విభాగాల సిబ్బందితో కలిసి ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు అభివృద్ధి పథకాల వీడియో సందేశం ద్వారా, క్షేత్రస్థాయిలో సమగ్ర నివేదికలు చదివి వినిపించి గ్రామసభలను నిర్వహించారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు భీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ భీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి సమస్య పరిష్కారానికి బలమైన వేదిక గ్రామసభ అని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు.

తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. వాణిజ్య పంటల వైపు రైతులను ఆకర్షించాలని, ఆయిల్ ఫామ్, సాగు లాభదాయకంగా ఉందన్నారు. అంతర్ పంటల ద్వారా రైతులకు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. నానో యూరియాపై ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, గ్రామ పంచాయతీ సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఏమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్2, నంది పత్రిక** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పుట్టినరోజు సందర్భంగా గురువారం మాజీ కౌన్సిలర్, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఉసేన్ భాష ఆధ్వర్యంలో స్థానిక అన్నా క్యాంటీన్ లో పట్టణంలో పేదలకు ముడుపుల భోజనాన్ని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రజాసేవలోకి ప్రవేశించి, ఆమె కృషితో ప్రజల్లో విశేషమైన గుర్తింపు సంపాదించుకున్న నేత ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి కళాశాల అధినేత మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పచ్చిరొట్టకు పీఎండీఎస్ విత్తన కిట్ వినియోగం లాభదాయకం

**వెలుగోడు, ఏప్రిల్ 02 (నంది పత్రిక):** పచ్చిరొట్టలో జిలుగులకు బదులుగా రైతులకు మేలు చేసే "పీఎండీఎస్ విత్తనాల మిశ్రమ కిట్"ను వినియోగించి లాభం పొందాలని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి సూచించారు.ఆమె మాట్లాడుతూ, ఈ కిట్‌లో వివిధ రకాల ధాన్యాలు, పప్పుదినుసులు, నూనె గింజలు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి మరియు సుగంధ ద్రవ్యాల విత్తనాలు సమగ్రంగా ఉండటం వల్ల ఇది పచ్చిరొట్ట ఎరువుగా ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కిట్‌లో మొక్కజొన్న, జొన్నలు, కొర్రలు, రాగులు, సజ్జలు వంటి ధాన్యాలు, కందులు, పెసలు, మినుములు, శనగలు వంటి పప్పుదినుసులు, నువ్వులు, వేరుశనగ, ఆవాలు, ఆముదం, పొద్దుతిరుగుడు వంటి నూనె గింజలు, బెండ, గోరుచిక్కుడు, తోటకూర, వంకాయ. అనప, బీర, కాకర, దోసకాయ వంటి తీగజాతి పంటలు మరియు ధనియాలు, మెంతులు వంటి సుగంధ ద్రవ్యాల విత్తనాలు కూడా ఇందులో ఉన్నాయి.ఈ విధంగా మొత్తం 37 రకాల విత్తనాలతో రూపొందించిన ఈ కిట్‌ను పచ్చిరొట్ట పంటగా సాగు చేయడం ద్వారా నేల సారాన్ని పెంచడంతో పాటు పంట దిగుబడులు కూడా మెరుగుపడతాయని ఆమె వివరించారు. సంప్రదాయంగా ఉపయోగించే జీలుగల పచ్చిరొట్ట కంటే ఈ పీఎండీఎస్ కిట్ మరింత ప్రభావవంతంగా, లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం ద్వారా నిరూపితమైందని తెలిపారు. అందువల్ల రైతు సోదరులు ఈ ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట పంటగా పీఎండీఎస్ కిట్ విత్తనాలను వినియోగించి ప్రయోజనం పొందాలని మండల అధికారి స్వాతి తెలిపారు.

## రాష్ట్రస్థాయి మాస్టర్స్ క్రీడల్లో రాణించిన కర్నూలు పోలీసు క్రీడాకారులు.

**విజేతలైన పోలీసు క్రీడాకారులను అభినందించిన... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**



**కర్నూలు నంది పత్రిక....** ఆంధ్రప్రదేశ్ శాప్ లీగ్ మాస్టర్స్ క్రీడలలో పాల్గొని బంగారు, వెండి, కాంస్యం పతకాలు సాధించిన ఆర్ ఎస్సై, కానిస్టేబుల్ ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ అభినందించారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మార్చి 30, 31 తేదిలలో 35 నుండి 45 ఏళ్ళ వయస్సు విభాగంలో ఈ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటిలలో ఆర్ ఎస్సై పి.ఆర్ మహేశ్వరెడ్డి, కానిస్టేబుల్ శివకుమార్ లు పతకాలు సాధించారు. ఈ సంధర్బంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విజేతలైన పోలీసు క్రీడాకారులు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు ఎస్పీ మెడల్స్ మరియు శాలువతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలీసు విధులలో ఒత్తిడితో ఉంటూ క్రీడలలో కూడా రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆకాంక్షించారు. ఆర్ ఎస్సై పి.ఆర్ మహేశ్వర రెడ్డి ... గుంటూరు ఆచార్యయూనివర్సిటిలో 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించారు.గత 5 సంవత్సరాలుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ లలో పాల్గొంటూ , చెన్నై నేషనల్ మీట్ లలో కూడా ప్రతిభ చూపారు. కానిస్టేబుల్ శివకుమార్ ..(కర్నూలు ట్రాఫిక్ పియస్) గుంటూరు ఆచార్య యూనివర్సిటీలో లాంగ్ జంప్ లో క్యాంస పతకం సాధించారు. గతంలో సౌత్ జోన్ నేషనల్స్, కేరళ జూనియర్స్ నేషనల్ , రాష్ట్ర మరియు జిల్లా స్థాయి లాంగ్ జంప్ పోటీలలో కూడ ప్రతిభ చూపారు. వీరిద్దరూ జాతీయ స్థాయి క్రీడలలో కూడా పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆర్ ఐ జావేద్, మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, సెక్రటరీ రవికుమార్ ఉన్నారు.

## కూరగాయల మార్కెట్ లో సైకిల్ స్టాండ్ లో వాహనాలు తొలగించండి.

**వాహనాలు ఇలా ఉంటే వేలం పాట దారుడికి ఇబ్బంది.**

**మున్సిపల్ అధికారులు వెంటనే వాహనాలు లేకుండా చర్యలు చేపట్టండి.**





**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 2 ( నంది పత్రిక )** నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఎట్టకేలకు కూరగాయల మార్కెట్,సైకిల్ స్టాండ్ వేలం పాటలు నిర్వహించారు.మూడేళ్లుగా కూరగాయల మార్కెట్ వేళలు జరగకపోవడంతో మున్సిపాలిటీకి భారీగా నష్టం వాటిల్లింది.ఈ నేపథ్యంలో కూరగాయల మార్కెట్ కు 51 లక్షల 15 వేలకు,సైకిల్ స్టాండ్ కు లక్షా 31 వేలకు పాటదారులు పదుకున్నారు.ఇక్కడే వేలం పాట పాటధారులకు ఇబ్బందులు తలెత్తాయి.సైకిల్ స్టాండ్ కు సంబంధించిన వేలం పాట డబ్బులు అంతా అధికారులు కట్టించుకున్నారు.ఇక్కడి వరకు బాగుంది,అసలు కథ ఏమంటే కూరగాయల మార్కెట్ లో సైకిల్ స్టాండ్ ప్రాంతంలో భారీగా వాహనాలు ఉండడంతో వేలం పాట దారుడు ఏమి చేయలేని పరిస్థితి.అక్కడ నుంచి తొలగించాలని ఆ వాహన దారులకు చెప్పినా పట్టించుకోకపోవడం విశేషం.పెట్టిన పెట్టుబడి రావాలన్నా,వాహనాలు పార్క్ చేయాలన్నా ఇదొక్కటే మార్గం కావడంతో ఇబ్బంది తలెత్తింది.అధికారులు ఇచ్చిన స్థలంలో వాహనాలు తొలగించాలంటే నష్టపోతామని వేలం పాట దారుడు షేక్ షరీఫ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ అధికారులు వెంటనే అక్కడ ఉన్న వాహనాలు తొలగించి వేలం పాట దారుడు కు న్యాయం చేస్తారని ఆశిద్దాం.

## ఏప్రిల్ 4న మేజర్ పంచాయతీ మార్కెట్ వేలం పాటలు.



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 02 (నంది పత్రిక):** ఏప్రిల్ 4 వ తేదీన రుద్రవరం మేజర్ పంచాయతీ మార్కెట్ వేలం పాటలు1 సచివాలయంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి ఈవో వడ్డె రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి రాంబాబు ఆదేశాల మేరకు మార్కెట్ వేలంపాటలను నిర్వహిస్తున్నామన్నారు. వారం సంత మార్కెట్ కు రూ1 లక్ష రూపాయలు, దినసరి మార్కెట్కు రూ 50,000 చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంపాటల్లో పాల్గొనవచ్చునారు. వేలం పాటలు అధికారుల ఆదేశాల అనుసారము నిబంధనల ప్రకారం నిర్వహిస్తామన్నారు.

# భూసారాన్ని పెంచడం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం

# ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి.

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు, నంది పత్రిక**....భూసారాన్ని పెంచడానికి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేసే విధంగా వారికి ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సహజ వ్యవసాయం పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరూ ్రావీణామరియు పచ్చి రొట్ట ఎరువుల సాగు చేసేలా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. భూమి లేని ఒక మహిళ, కేవలం 50 సెంట్ల భూమిని కౌలుకు తీసుకుని, సొంతంగా విత్తనాలు తయారు చేసుకుని ప్రకృతి వ్యవసాయం ద్వారా నెలకు దాదాపు ₹20,000 నుండి ₹30,000 వరకు సంపాదిస్తూ, ఏడాదికి ₹1.20 లక్షల ఆదాయం పొందుతున్నారన్నారు. కూలి పనుల కోసం గుంటూరు, హైదరాబాద్ లేదా కర్ణాటక వంటి ప్రాంతాలకు వలస వెళ్లేకంటే, ఇలాంటి స్వయం ఉపాధి మార్గాలు ఎంతో మేలని కలెక్టర్ పేర్కొన్నారు. నేల సారాన్ని కాపాడటం కొరకు పిల్లి పెసర, సన్ హెమ్ప్, ధైంచా వంటి పచ్చి రొట్ట ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయి పర్యటనలు పెంచాలని మరియు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, పంట నష్టాలు జరుగకుండా, రైతులకు సరైన మార్గదర్శకత్వం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వ్యవసాయం,అనుబంధ శాఖల ద్వారా తలసరి ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, స్థానిక నేల స్వభావం, వర్షపాతం మరియు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేయడంలో రైతులకు వ్యవసాయ అధికారులు సహాయపడాలన్నారు. పత్తికి మంచి ధర లభిస్తోంది, కాబట్టి దాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతుకు 3 ఎకరాలు ఉంటే, కనీసం 4 రకాల పంటలు వేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఉద్యానవన పంటల సాగును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ సంవత్సరం మల్లెపూల సాగు 1000 హెక్టార్ల లో పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం అన్నారు. మల్లె సాగు వల్ల రైతుకు నాలుగు, ఐదు నెలల కాలంలో మంచి ధర లభిస్తుందని, తద్వారా రైతు చేతికి ఎక్కువ డబ్బు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మల్లెపూలతో పాటు మామిడి, అరటి, దానిమ్మ పంటలను కూడా ప్రోత్సహించాలన్నారు. ప్రతి మండలానికి కనీసం పది హాఫ్ మూన్ మోడళ్లను ఏర్పాటు చేసే విధంగా లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. మండలాలలో ఎఫ్‌పిఓల సంఖ్య పెరగాలని, అందులో సభ్యుల సంఖ్య ఎంత పెరిగిందనే వివరాలను వ్యవసాయ అధికారులు ఇవ్వాలన్నారు. పంట పండించడమే కాకుండా, ఎక్కడ అమ్మితే ఎక్కువ లాభం వస్తుందో తెలుసుకోవడానికి కర్ణాటక, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు ఒక బృందాన్ని పంపి మార్కెట్ అధ్యయనం చేయించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా మార్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా నిర్మాణానికి భారీ పెట్టుబడులు అవసరమని, ప్రభుత్వం ఒక సమగ్ర నమూనాను సిద్ధం చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. పంటలను తరలించడానికి రోడ్ల అభివృద్ధి, రవాణా సౌకర్యాలు మరియు మార్కెటింగ్ సహాయంతో కూడిన ఒక లాజిస్టిక్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ల వాడకాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. ట్రాక్టర్లు, ఫ్లోయింగ్ మిషన్లు, టిల్లర్లు మరియు విత్తనాలు వేసే యంత్రాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పొందేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కూలీల కొరత మరియు పెరుగుతున్న ఖర్చుల వల్ల పెట్టుబడి పెరుగుతోందని, యంత్రాలను వాడటం ద్వారా ఈ ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని మరియు నానో యూరియా వినియోగాన్ని పెంచాలన్నారు. రైతులకు ఆదాయం పెరగాలంటే పశువుల పెంపకం చాలా ముఖ్యమని, ప్రతి రైతు కనీసం ఒక పశువునైనా (ఆవు, బర్రె, గొర్రె, మేక లేదా కోడి) పెంచాలని కలెక్టర్ సూచించారు. యానిమల్ హస్బెండరీ డిపార్ట్‌మెంట్‌కు కేవలం 400 పశువుల పంపిణీ లక్ష్యం సరిపోదని, జిల్లాలోని 3.5 లక్షల కుటుంబాలకు పశువులను అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసక్తి ఉన్న రైతులకు లోన్లు ఇప్పించి పశువులను కొనుగోలు చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు నిరంతర ఆదాయం లభించాలని, వారి తలసరి ఆదాయం పెరగడమే తన ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళ, బుధవారాల్లో ఈ విషయాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొత్త సాంకేతికతలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు వేసేటప్పుడు వెదజల్లడం కాకుండా, బెడ్స్ వేసుకోవాలని లేదా డిబ్లర్ ఉపయోగించాలని, దిగుబడి పెంచడానికి మెరుగైన విత్తన రకాలను వాడాలనే విషయాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కె.వి.కె శాస్త్రవేత్తల సహాయంతో కొత్త టెక్నిక్స్ నేర్చుకుని, ఆ సమాచారాన్ని రైతులకు చేరవేయాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత ఉన్న చోట అందరూ వరి సాగు చేస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. వరి సాగును తగ్గించి ఆయిల్ పామ్ వంటి ఇతర లాభదాయకమైన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. హాఫ్ మూన్ మోడల్ మరియు పీఎండీఎస్ పద్ధతులలో సుమారు 15 రకాల విత్తనాలతో సీడ్ పెల్లెట్స్ ఎలా తయారు చేసుకోవాలో, వాటిని ఎలా చల్లాలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ పద్ధతి ద్వారా 45 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు వారికి ఉన్న పొలంలో కేవలం ఒక పంట కాకుండా 4, 5 రకాల పంటలు వేయడం, పాడి పశువులను పెంచడం ద్వారా వారికి ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, న్యాచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక**.....చేనేత సంక్షేమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ లో ఉచిత విద్యుత్ పథకం"కు సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ అధికారికంగా విడుదల చేశారు. 07 మంది ఉచిత విద్యుత్ పథకం లబ్దిదారులకు ధృవపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం "ఉచిత విద్యుత్ పథకం" ద్వారా చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని, ఈ పథకం ద్వారా ఒక్కొక్క చేనేత కుటుంబానికి నెలకు రూ. 720/- చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.8640/- మరియు ఒక్కొక్క పవర్ లూం యూనిట్ నిర్వాహకులకు నెలకు రూ.1800/- చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.21,600/- ఆర్థికంగా లబ్ది కలుగుతుందని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ పథకం ద్వారా 2457 చేనేత కుటుంబాలకు మరియు 01 మరమగ్గ కుటుంబానికి లబ్ది కలుగుతుందని తెలిపారు.ఈ పథకం ద్వారా చేనేత కార్మికులపై విద్యుత్ వ్యయం భారం తగ్గి, వారి జీవనోపాధి మెరుగుపడటంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, గ్రామీణ ఉపాధికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అలాగే, చిన్న మరియు గృహాధారిత చేనేత కార్మికులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.నాగరాజా రావు, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి, కర్నూలు & నంద్యాల, వి.నరసింహా రెడ్డి, అభివృద్ధి అధికారి(చే. జౌ) మరియు సహాయ అభివృద్ధి అధికారులు(చే.జౌ), చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన వేడుకలు.

**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 02 (నంది పత్రిక):** మండల కేంద్రం రుద్రవరంలోని అమ్మవారు శాల నాలుగు రోడ్లకూడలిలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, మండల టిడిపి కన్వీనర్ లింగం వెంకట రంగనాయకులు శెట్టి, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చిత్రపటం ముందు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకల సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లడి చంద్రశేఖర్ యాదవ్, బండారు బాలరాజు యాదవ్, లక్ష్మీకాంత్ యాదవ్, మీసాల లక్ష్మీ నరసయ్య, గాంధీసురేష్, రామయ్య, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం

### సాధారణ కాన్పులకు పెద్దపీట - జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



**కర్నూలు, నంది పత్రిక**.....ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం సాధించిందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యధికంగా ప్రసవాలు నిర్వహించి కర్నూలు జిల్లా రాష్ట్రంలో టాప్ లో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. 2025 ఏప్రిల్ నుండి 2026 ఫిబ్రవరి వరకు 11 నెలలకు 5500 ప్రసవాలు లక్ష్యం కాగా లక్ష్యానికి మించి 145 శాతం తో 7982 ప్రసవాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో సాధారణ ప్రసవాలు 5881 కాగా, సిజేరియన్ కాన్పులు 2101 చేశామన్నారు. 30 శాతం మించి సిజేరియన్ కాన్పులు జరగకూడదని, జిల్లాలో 26 శాతం మాత్రమే సిజేరియన్ కాన్పులు చేసి, సాధారణ కాన్పులకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు ఏరియా హాస్పిటల్, పత్తికొండ , ఆలూరు, కోడుమూరు, వెల్దుర్తి, ఓర్వకల్లు సీహెచ్సీ ల్లో ఈ ప్రసవాలు జరిగాయని కలెక్టర్ వివరించారు.

## 10 పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి.... రాష్ట్ర పరిశీలకులు ఎం,అనురాధ.




**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 02 (నంది పత్రిక):** 10 పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని పరీక్షలు రాష్ట్ర పరిశీలకులు ఎం ,అనురాధ అన్నారు. గురువారం మండలంలోని నరసాపురంలోని సెయింట్ థామస్ మార్థోమ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకులు ఎం అనురాధ సందర్శించి తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును, విద్యార్థులకు కల్పించిన వసతులను ఆమె నిశితంగా పరిశీలించారు. కేంద్రంలో నిబంధనల ప్రకారం ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారని ఆమె ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పాటిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని మరియు సిబ్బందిని ఆమె అభినందించారు. పరీక్ష నిర్వహణఅధికారులు చీఫ్ సుబ్బరాయుడు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ మస్తాన్ పరీక్షా కేంద్రం అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### అమరావతికి చట్టబద్ధతపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో వేడుకలు

**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2 నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలపడంతో.. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వేడుకలు నిర్వహించారు. అమరావతికి మద్ధతు పలుకుతూ కార్యాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు, మహిళలు తమ ఇళ్ల ముందీలు రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించడం దేశంలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వరల్డ్ క్లాస్ రాజధానికి అమరావతి రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో అదనపు కమిషనర్ శారదా దేవి, రెవిన్యూ అధికారి సేతుమాదవ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



# అమరావతికి చట్టబద్ధత

## ప్యాపిలిలో టిడిపి శ్రేణుల సంబరాలు



**నందిపత్రిక - ప్యాపిలి** రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందడంపై ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో భారీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి,టి. శ్రీనివాసులు,రాజా నారాయణమూర్తి, మెట్టుపల్లె సుదర్శన్, కొంగనపల్లి మధు, రామ్మోహన్ మాట్లాడుతూ.. అమరావతి రాజధానిగా స్థిరపడటం ఐదు కోట్ల ఆంధ్రుల విజయం అని కొనియాడారు. హోరెత్తిన బైక్ ర్యాలీసాయంత్రం 5 గంటలకు స్థానిక టిడిపి కార్యాలయం నుండి కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. పార్టీ జెండాలతో, అమరావతికి మద్దతుగా నినాదాలు చేస్తూ బస్టాండ్, కోట్ల సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. జై అమరావతి నినాదాలతో ప్యాపిలి పురవీధులు మారుమోగాయి.

**బాణాసంచా సంబరాలు - కేక్ కటింగ్:** అంబేద్కర్ సర్కిల్ వద్ద పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి సందడి చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి చట్టబద్ధత లభించడం చారిత్రాత్మక ఘట్టమని, కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి పునరంకితమవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, ప్రిన్సిపాల్ మధు, చల్లా వీర, ఎస్కే వలి, నారాయణ, కదిరిప్ప, కిట్టు, వెంకటేష్, రమేష్, దామోదర్, మద్దిలేటి, బర్మా శ్రీధర్, డిష్ శీను, ప్రతాఫ్, కోదండ, పుల్లయ్య, నాగేశ్వరరావు, చంద్ర తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లాలో పశువులకు 5 జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు కు చర్యలు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



**కర్నూలు , నంది పత్రిక**.....కర్నూలు జిల్లాలో పొట్టేలు , మేకలు , గొర్రెలు యొక్క అధిక నివాస సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ఐదు ప్రాంతాలలో వాటికి అవసరమైన జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి సంబంధిత కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధ్యక్షతన జిల్లాలో పశు సంవర్ధక శాఖకు చెందిన షీప్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనరిక్ మందుల అవుట్లెట్ లను ఏర్పాటు చేయుటకై కమిటీ సమావేశాన్ని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ... జిల్లాలో పొట్టేలు , మేకలు , గొర్రెలు అధిక సంఖ్య లో ఉన్న ఐదు ప్రాంతాలు కర్నూలు , ఆదోని , పత్తికొండ , కోడుమూరు , హొలగుంద లలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పశు వైద్యశాలలలోని ప్రభుత్వ భవనాలు లేదా ఆసుపత్రి ప్రభుత్వ స్థలాలలో జనరిక్ మందుల షాపులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్ ను ఆదేశించారు. ఈ మందుల దుకాణాలు ఏర్పాటు చేయడానికి కమిటీ సభ్యులు అన్ని విధాలుగా సహకరించాలని ఆదేశించారు.ఆర్ అండ్ బి ఎస్ఈ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ భవనాల కు సంబంధించిన రెంట్ ప్రపోజల్స్ మరియు రెవెన్యూ అధికారుల సహాయంతో వారు వాడుకునే స్థలాల లీజ్ ప్రపోజల్ , ఎస్టిమేషన్లు ఇవ్వవలసిందిగా , డ్రగ్ కంట్రోల్ అధికారి దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయడం , జిల్లా సహకార శాఖ అధికారి షీప్ సొసైటీ సహకార సంఘాల ఆధ్వర్యంలో 4 దుకాణాలు మరియు స్వయం సహాయక బృందం తో ఒకటి ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకొన వలసిందిగా ఆదేశించారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జెడి మాట్లాడుతూ... షీట్ ఫెడరేషన్ ఒక దుకాణం యూనిట్ కాస్ట్ 3 లక్షలు 61 వేలుగా నిర్ణయించడం జరిగిందని , నాలుగు సంఘాలు ఇప్పటివరకు ముందుకు వచ్చాయని , హొళగుంద దుకాణానికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అందుకుగాను వారికి 1లక్ష 50 వేల రూపాయల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద ఇస్తుందని మిగిలిన నాలుగు దుకాణాలకు ఆంధ్రప్రదేశ్ షీప్ ఫెడరేషన్ 1,50,000 సబ్సిడీ భరిస్తుందని కలెక్టర్ కు తెలియజేశారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జెడి పశుసంవర్ధక శాఖ హేమంత్ కుమార్ , ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి , ఏడి డ్రగ్స్ కంట్రోల్ హరి హర తేజ ,డిసిఓ శిరీష , ఏడి షీప్ డెవలప్మెంట్ రవిప్రకాష్ రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

## కోటపాడు లో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు.

### విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టిన టిడిపి నేతలు.

**శిరివెళ్ల :-(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమ అఖిలప్రియ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి నీటి సంఘం వైస్ చైర్మన్ చింతకుంట్ల భూసి రెడ్డి తదితర టిడిపి ప్రముఖుల ఆధ్వర్యంలో ఎంఎల్ఏ భూమా అఖిల ప్రియ గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు పంచుకొన్నారు. అనంతరం కోటపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బిస్కెట్లు స్వీట్లు పంచి పెట్టారు ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పరితపిస్తూ అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూమ అఖిల గారు పార్టీలకు వర్గాలకుగాతీతంగా అభివృద్ధి కృషి చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# సీమాంధ్రుల కలల రాజధాని అమరావతి.

## జగన్ తలకిందులు తపస్సు చేసినా అమరావతిని కదిలించలేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ

**కర్నూలు నంది పత్రిక.....** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఈరోజు చారిత్రాత్మక రోజు..దుష్టుల నుంచి అమరావతి రాజధానికి రక్షణ కల్పించిన శుభదినం. అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక ధన్యవాదాలుతెలియజేశారు.పార్లమెంట్లో అమరావతి చట్టబద్ధత బిల్లుకు సహకరించిన పీఎం నరేంద్రమోడికి, కేంద్రమంత్రి అమిత్ షా, లోక్ సభకు ధన్యవాదాలు సీఎం చంద్రబాబు నేతృత్వంలో త్వరలో అద్భుత నగరం ఆవిష్కరణ కాబోతోంది.సీమాంధ్రుల కలల రాజధాని అమరావతి.. ప్రపంచం మెచ్చిన నగరంగా అవతరించబోతోంది.అమరావతి రాజధాని కోసం, ఆ ప్రాంత రైతుల కోసం పోరాడిన మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు కూటమి ఐక్యతకు, రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలుఅమరావతి ప్రాంత మహిళలు, రైతుల త్యాగాలు వృథా కాలేదు.జగన్ ఎన్ని జన్మలెత్తినా అమరావతిని టచ్ చేయలేరు.మొన్నటి వరకూ మూడు ముక్కలాట, ఇప్పుడు ప్లాన్ బి అని జగన్ మరో కుట్ర పన్నాడు మావిగన్ అని. రాష్ట్ర రాజధానికి పేరు పెట్టాలని పిచ్చి సలహా అసెంబ్లీలో అమరావతికి అనుకూలంగా ఈరోజు వీళ్లు తీర్మానం రేపు నేను గెలిస్తే ఇదే అసెంబ్లీలో అమరావతికి వ్యతిరేకంగా తీర్మానం చేస్తానంటున్నాడు.జగన్ తలకిందులు తపస్సు చేసినా అమరావతిని కదిలించలేడు పిచ్చోడి చేతిలో ఎవరూ రాయి పెట్టరు... మరోసారి జగన్ కు ప్రజలు అవకాశం ఇవ్వరు.

అమరావతికి జగన్ వ్యతిరేకి అని మరోసారి రుజువైంది...అమరావతిపై ఆయనదో మాట. సజ్జల రామకృష్ణ రెడ్డిదో మాట.ఒకరు జై కొడతారు.. మరొకరు నై అంటారు...లోక్ సభ, రాజ్యసభలో అమరావతి రాజధాని బిల్లుకు మద్దతివ్వకుండా వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు.

వైసీపీకి, జగన్ కు రాష్ట్ర ప్రజల గురించి, యువత గురించి, వారి భవిష్యత్తు గురించి ఆలోచనే లేదు. వైసీపీ



పిచ్చోళ్లు, రాక్షసుల పార్టీ.వాళ్లకు పాలన తెలీదు.దోచుకోవడం, దాచుకోవడమే తప్ప.తన స్వార్థం కోసం కన్న తల్లికి, జన్మభూమికి మోసం చేయడం జగన్ కు అలవాటే కదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ..అన్నారు.

# ఆరాధనకు బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి





**మంత్రాలయం న్యూస్ :-** మండల పరిధిలోని చెట్నిహల్లి, కలుదేవకుంట గ్రామాల సమీపంలో నిర్మాణం చేపట్టనున్న బైపాస్ రోడ్డును ఆగష్టు నెలలో రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు పూర్తి చేసి సహకరించాలని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు కోరారు. గురువారం కలుదేవకుంట గ్రామ సమీపంలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి జనసేన పార్టీ ఇన్చార్జి బి. లక్ష్మన్నలతో కలిసి పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన భక్తుల వాహనాలతో ఇతర భారీ చిన్న తరహా వాహనాలతో ట్రాఫిక్ జామ్ కావడం సమస్యగా ఉందని, ట్రాఫిక్ నియంత్రణకు కేంద్ర మంత్రి నితిన్ గట్కారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సూచనతో కేంద్ర ప్రభుత్వం నుంచి డబల్ లైన్ బైపాస్ రోడ్డు ఏర్పాటుకు భూ సేకరణకు 27 కోట్లు, రోడ్ల నిర్మాణానికి 22 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఇందులో భాగంగానే సాయినాథ కన్స్ట్రక్షన్స్ వారి ఆధ్వర్యంలో 150 మీటర్ల రోడ్డుకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. రోడ్డు పూర్తి అయితే భారీ వాహనాలతో పాటు మంత్రాలయం కు సంబంధం లేకుండా బయట నుండి రాక పోకలు కొనసాగించుకోవచ్చని దీని ద్వారా ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా వాహనాలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని, ముఖ్యంగా పోలీసుల కష్టాలు కొంత తీరుతాయని తెలిపారు. కాంట్రాక్టర్ మహేశ్వర్ రెడ్డి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి ఉడుపి పరమేష్ స్వామి ఎల్ పవన్ స్వామి పురోహితులు డోన్ రాఘవేంద్రాచార్ ఎస్సై మల్లికార్జున టిడిపి పట్టణ ఇంచార్జీ బి వరదరాజులు ఎంపిటిసి మేకల వెంకటేష్ మంచాల సొసైటీ డైరెక్టర్ డిసి తిమ్మప్ప మాలపల్లి మాజీ సర్పంచ్ చావిడి వెంకటేష్ కలుదేవకుంట సొసైటీ డైరెక్టర్లు మాలపల్లి లక్ష్మన్న కలుదేవకుంట కురువ భీమయ్య రాఘన్న మల్లయ్య సైట్ ఇంజనీర్ రాజేష్, సర్వేయర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కరి వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం



**మంత్రాలయం , న్యూస్ :-** మండల పరిధిలోని కలుదేవకుంట గ్రామంలో శ్రీ కరి వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయ ధర్మకర్త కె. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం వంటి విశేష పూజలతో నైవేద్య సమర్పణతో మంగళ హారతులిచ్చారు. అనంతరం రాఘవరెడ్డి ఇంటి నుంచి పూర్ణకుంభంతో రథం చుట్టూ తిరిగి పార్వతి పరమేశ్వరులకు సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై సీతారామిరెడ్డి నేతృత్వంలో కలుదేవకుంట సొసైటీ మాజీ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రవీంద్ర రెడ్డి యువ నాయకులు కె. విఖ్యాత రెడ్డి ల సారథ్యంలో శివ పార్వతుల మూర్తులను రథం పై ఉంచి పూజారులు మంగళ హారతులు ఇచ్చిన అనంతరం మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ బాణా సంచా పేల్చుతూ భక్త జనుల సందోహం మధ్య ఘనంగా రథోత్సవాన్ని ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో భద్రత కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ వర్మ వైసిపి నాయకులు ఆడిట్ శంకర్ స్వామి నారాయణ రెడ్డి రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమరావతి నిర్ణయానికి ఆళ్లగడ్డలో ఘనంగా సంబరాలు--

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 2: నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధ గుర్తింపు లభించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ఆశయాలకు న్యాయం చేయడమే కాకుండా, అభివృద్ధి దిశగా కీలక మలుపుగా భావిస్తున్నారు.ఈ సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలో ఎమ్మెల్యే భూమా ఆదేశాల మేరకు పట్టణంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష నాగాంజనేయులు టిడిపి కార్యకర్తలు భూమా అభిమానులు బాణాసంచా పేల్చి అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు పట్టణంలోని అన్ని కార్యాలయాల్లో ముగ్గులతో విద్యుత్ దీపాలంకరణలతో సంబరాలు నిర్వహించారు.కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి , సిబ్బంది ఎంపీడీవో నూర్జాన్ బేగం సిబ్బంది పురపాలక సంఘం శాంటార్ ఇన్స్పెక్టర్ బాలస్వామి పురపాలక సిబ్బంది తదితరులు కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# పి.జి.ఆర్.ఎస్ ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం అర్జీదారులు నూరు శాతం సంతృప్తి:



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2 నంది పత్రిక** జిల్లాలో ప్రజల నుండి అందుతున్న పి.జి.ఆర్.ఎస్ ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించడంపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్ నుండి పి.జి.ఆర్.ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై గురువారం జిల్లా కలెక్టర్ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సంతృప్తి స్థాయిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాంపురం గ్రామానికి చెందిన ప్రభాకర్ రావుతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, ఆయన సమస్య పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభాకర్ రావు మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ ఏర్పాటుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని, అయితే పి.జి.ఆర్.ఎస్‌లో దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయబడిందని తెలిపారు. అధికారులు వేగంగా స్పందించి సమస్యను పరిష్కరించడంతో తాను ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆచంట గ్రామానికి చెందిన తమ్మినీడి విజయలక్ష్మి తన సమస్య పరిష్కారంపై మాట్లాడారు. 29 సంవత్సరాలుగా కొనసాగుతున్న వారసత్వ భూ పంపకాల సమస్య పి.జి.ఆర్.ఎస్‌లో అర్జీ చేసిన వెంటనే పరిష్కార దిశగా ముందుకు సాగిందని తెలిపారు. ఆర్డీవో మరియు ఎమ్మార్వోలు స్వయంగా వచ్చి భూ పంపకాల ప్రక్రియను పూర్తి చేసి, తన వాటాగా వచ్చిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారని చెప్పారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్య ఒకే దరఖాస్తుతో పరిష్కరించబడటం ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ విధంగా సుమారు 20 మంది అర్జీదారులతో జిల్లా కలెక్టర్ స్వయంగా మాట్లాడి, వారి ఫిర్యాదుల పరిష్కారం విధానం, సమయం మరియు సంతృప్తి స్థాయిని తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి.జి.ఆర్.ఎస్ ద్వారా అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు శ్రద్ధగా, సమగ్రంగా పరిష్కరించాలని సూచించారు. ఒకసారి పరిష్కరించిన ఫిర్యాదు మళ్లీ రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, అలా చేయడం ద్వారా ప్రజల విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుల సమర్థ పరిష్కారం ద్వారా అధికారులకు కూడా మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ అవార్డు అధికారి వై.దోసిరెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## స్వచ్ఛరథాన్ని సద్వినియోగం చేసుకోండి

### - ఎంపీడీవో మేరీ



**కొత్తపల్లి – నంది పత్రిక:** గ్రామాలలోని ప్రజలు స్వచ్ఛరథాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం స్వచ్ఛరథం కార్యక్రమాన్నీ ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా ప్రజలు తమ ఇళ్ళలోని చెత్త, ప్లాస్టిక్, పనికిరాని వస్తువులను స్వచ్ఛరథం సిబ్బందికి ఇచ్చి వాటికి బదులుగా నిత్యావసర సరుకులు, వస్తువులు పొందవచ్చునన్నారు. విద్యార్థులు కూడా వారి ఇళ్ళలోని తల్లి,దండ్రులకు, ఇంటి ప్రక్కన వారికి ఈ రథం గురించి వివరించి గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో డీప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు, ప్రదానోపాధ్యాయుడు ఉశేనయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం



**కర్నూలు నంది పత్రిక....** ఏప్రిల్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగినది ఈ సమావేశం వెంకటరాముడు అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ఇన్చార్జ్ అయినా కె. జగన్నాధం హాజరయ్యారు .ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజానాట్యమండలి కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే కొత్త కొత్త కళారూపాలు ఏర్పాటు చేసుకొని ప్రజల్లోకి పోవాలి అని జిల్లా సమావేశంలో ఆయన తెలియపరిచినారు ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వి. నాగరాజు మాట్లాడుతూ మహానందిలో జరిగిన ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర కౌన్సిలలో జరిగినా నిర్ణయాలు ప్రస్తావించినారు ఈ రాష్ట్రంలో నాలుగు ప్రాంతాలలో కోస్తా ఉత్తరాంధ్ర ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో కోస్తా ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లా సమావేశాలు జరుగుతున్నాయని మాట్లాడినారు ప్రజానాట్యమండలి నిర్మాణం గురించి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వివిధ నియోజకవర్గాలలో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు దాంట్లోఈ మూడు నియోజకవర్గాలలో ఈ నెల 9వ తేదీన పత్తికొండలో 12వ తేదీన ఆదోనిలో 16వ తేదీన ఆస్పరిలో ఈ మూడు ప్రాంతాలలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా కౌన్సిల్ తీర్మానం చేసినది ఆ నియోజకవర్గాలలో సిపిఐ పార్టీ నాయకులు సహాయ సహకారాలు అందించాలి. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలు జూన్ జూలైలో పత్తికొండ లేదా కర్నూల్ లో ఈ రెండు ప్రాంతాలలో చేయాలని తీర్మానించినారు తిరుపతిలో జరుగుతున్న ఏపీ ప్రజానాట్యమండలి సమావేశాలకి కర్నూలు జిల్లా నుండి 20 మంది హాజరుకావాలని నిర్ణయించినారు కర్నూలు జిల్లా హరసంలో ఏపీ ప్రజానాట్యమండలి ఈ నెలాఖరు లోపల సమావేశం ఏర్పాటు చేయాలని సంఘం ఇన్చార్జి కే జగన్నాథం కోరారు ఈ తీర్మానాలపై జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగినది ఈ తీర్మానాలన్నిటికి పార్టీ జిల్లా నాయకులు నియోజకవర్గ నాయకులు సహకరించాలని ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. నాగరాజు కోరారు .

## కొత్తూరులో 7 రోజుల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం.

### ప్రిన్సిపాల్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త వివరాలు వెల్లడింపు.

### సామాజిక సేవతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపు లక్ష్యం.



**కేసముద్రం, ఏప్రిల్ 02(నంది పత్రిక):** కేసముద్రం మండలం కొత్తూరు (పెద్దమోరితండా) గ్రామంలో కేసముద్రం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7 రోజుల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ నాయక్ సంయుక్తంగా గురువారం వివరించారు. కేసముద్రంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం పెంపొందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4 శనివారం రోజున కొత్తూరులో ఈ శిబిరం ప్రారంభం అవుతుందనీ, మొదటి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించి ముఖ్య అతిథుల ప్రసంగాలతో పాటు జాతీయ సేవా పథకం లక్ష్యాలను విద్యార్థులకు వివరించనున్నట్లు తెలిపారు. రెండవ రోజు విద్యార్థులు గ్రామంలోని రహదారులను శుభ్రపరచడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారని చెప్పారు. మూడవ రోజు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేస్తామని పేర్కొన్నారు. నాల్గవ రోజు పోలీసుల ద్వారా సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, భద్రతా విధానాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఐదవ రోజు సమాజంలో ఉన్న మూఢ నమ్మకాల నిర్మూలన కోసం చర్చలు, నాటికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆరో రోజు గ్రామంలో జనాభా, కుటుంబ వివరాలు, జీవన పరిస్థితులపై సర్వే చేపడతామని చెప్పారు. ఏడవ రోజు శిబిరం ముగింపు సందర్భంగా కార్యక్రమ సమీక్ష నిర్వహించి పాల్గొన్న విద్యార్థులకు ధృవపత్రాలు అందజేస్తామని వివరించారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ పెంపొందించడంతో పాటు గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు వివిధ వర్గాలు సహకరించాలని వారు కోరారు.

## సాంస్కృతిక క్రీడలను లాంఛనంగా ప్రారంభించిన ఎంఈఓలు.

**బేతంచెర్ల ఏప్రిల్ 2 ( నంది పత్రిక ).** బేతంచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం సాంస్కృతిక మరియు క్రీడలను లాంఛనంగా మండల విద్యాధికారులు జి.సోమశేఖర్ మరియు సి.టి. అబ్రహం లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సాంస్కృతిక, క్రీడా కార్య క్రమాల వలన మానసిక ఉల్లాసం, ఆరోగ్యం కలుగుతాయని,ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలలో రాణిమచాలని అభిప్రాయ పడ్డారు. ఆరోగ్యకరమైన శరీరము ఆరోగ్యకరమైన ఆలోచనలకు పురి గొల్పుతాయని తెలియ జేశారు.బేతంచర్ల విద్యార్థులు క్రీడలలో తమ ప్రతిభను చాటు కోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆటవిడుపుతో పాటు ఆనందం, ఆరోగ్యం కలుగజేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది తమ సహాయ సహకారాలు అదించడం సంతోషదాయకం. క్రీడలను మండల విద్యాధికారులు జి సోమశేఖర్ , సి. టిఅబ్రహం రిబ్బన్ కటింగ్ ద్వారా ప్రారంభించి, విద్యార్థులతో పాటు ఆడి,వారికి ప్రోత్సాహం కలిగించారు. క్రీడలలో భాగంగా వాలీబాల్ పోటీని వ్యాయామ ఉపాధ్యాయులు కమల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# చారిత్రక ఘట్టం: అమరావతికి చట్టబద్ధతపై డోన్‌లో 'కూటమి' సంబరాలు





విజయోత్సవ ర్యాలీ

## ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశాలతో భారీ బైక్ ర్యాలీ

**నందిపత్రిక –డోన్** ఆంధ్రుల దశాబ్దాల కల సాకారమైందని రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయ సభలు పునర్విభజన చట్ట సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడంపై వాల్మీకి బోయ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్, శేష్ ఫణి గౌడ్, జనసేన నాయకుడు ఆలా మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని డోన్ పట్టణంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున నిర్వహించారు.

**హోరెత్తిన డోన్ వీధులు**స్థానిక శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. వందలాది బైక్‌లతో కార్యకర్తలు జై ఆంధ్రప్రదేశ్, జై అమరావతి నినాదాలతో పట్టణ వీధులను హోరెత్తించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సర్కిల్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

**బాణాసంచా మోత.. కేక్ కటింగ్** అనంతరం పాత బస్టాండ్ వద్ద కూటమి నాయకులు భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

**ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ..**
"అమరావతిని ఆంధ్రుల ఏకైక రాజధానిగా గుర్తించడమే కాకుండా,

పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఈ నిర్ణయానికి మద్దతు తెలపడం శుభపరిణామం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలకు, రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు దక్కిన గౌరవం ఇది." ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం వేగవంతం అవుతుందని, డోన్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రమంతటా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించినందుకు బైక్ ర్యాలీ చేపట్టిన కర్నూలు టిడిపి అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ





**కర్నూలు నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2026 మార్చి 28న శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్లో బిల్లును ప్రవేశపెట్టగా పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్రంలోని ఎన్డీఏ పక్షాలవారికి కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు గురువారం సాయంత్రం తెలుగు యువత అధ్యక్షుడు ఎస్ అబ్బాస్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నగరంలోని కొండారెడ్డి బురుజు నుంచి జిల్లా టిడిపి కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి టిడిపి కార్యాలయం దగ్గర బాణసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు ఈ సందర్భంగా గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో విడిపోయిన తర్వాత రాజధాని లేని సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధాని నిర్మాణం కోసం ఎంతోమంది మేధావులతో చర్చించి ప్రజా సంఘాల నాయకులతో రాజకీయ పార్టీల నుండి సలహాలు తీసుకోవడం జరిగింది ఇందులో మెజార్టీ సభ్యులు అమరావతి రాజధానిగా సూచించారు రాజధాని కోసం 33 వేల ఎకరాలను సేకరించి రాజధాని నిర్మించాలని నిర్ణయించి రైతుల నుండి భూములను సేకరించారు ఎంతోమంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం జరిగింది 2019 నుంచి 2024 వరకు వైసిపి హాయంలో రాజధాని నిర్మాణం చేపట్టకపోగా మూడు రాజధానిలంటూ కల్లిబోల్లి మాటలతో పబ్బం గడిపారని 2024 ఎన్నికలలో టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజధానిలో అనేక కార్యక్రమాలు చేపట్టారని మనసున్న మహారాజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని చెప్పారు ఇప్పుడు ఏపీలోను కేంద్రంలోను అమరావతి రాజధానిపై సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సంజీవలక్ష్మి,జికియాన్సారీ, లక్ష్మీ మాలతి, హమీద్, రాజశేఖర్, కౌశిక్, నాగేంద్ర, సోమిశెట్టి నవీన్, సోమిశెట్టి శ్రీకాంత్, రామాంజనేయులు, పరమేష్, సందీప్, జగదీష్, కిరణ్, హనుమంతరావు చౌదరి, నంది మధు, బిసన్న, నాగేశ్వరరావు, రవి శర్మ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌గా సేవ చేసే అవకాశం అదృష్టం: జైపాల్

## ఘనంగా సర్పంచ్ జైపాల్‌కు వీడ్కోలు సభ.

**వెలుగోడు, ఏప్రిల్ 02 (నంది పత్రిక):** వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి సర్పంచ్‌గా సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని సర్పంచ్ జైపాల్ పేర్కొన్నారు. గురువారం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవీకాలం ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వీడ్కోలు సమావేశం కార్యనిర్వహణ అధికారి మల్లి నరేంద్ర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పంచాయతీ సర్పంచ్‌లు పాత బస్టాండ్ సమీపంలోని స్థలంలో గదులు నిర్మించి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్న ఘనత జైపాల్‌కే దక్కుతుందని ప్రశంసించారు. అలాగే జమ్మినగర్‌లో జమ్మిచెట్టు చుట్టూ అరుగు, సిమెంట్



రోడ్ల ఏర్పాటు, సిబ్బంది ద్వారా నిర్వహించిన సేవలు, కార్మికుల వేతనాలను రూ.3 వేల వరకు పెంచడం వంటి కార్యక్రమాలతో ఆయన మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. పట్టణంలోని 20 వార్డు సభ్యులను సర్పంచ్, ఈఓ, సిబ్బంది ఘనంగా సన్మానించి చీరలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ జైపాల్ దంపతులను గ్రామపంచాయతీ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ అల్లె తిరుపాలు రెడ్డి, ఆర్ ఆర్ సంస్థ అధినేత రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్లా కృష్ణుడు, యూటీఎఫ్ నాయకుడు రామ కృష్ణ, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రంగస్వామి ఘజ మాలలు, శాలువాలతో సర్పంచ్ దంప తులను సత్కరించారు. తదుపరి సర్పంచ్‌ను గ్రామపంచాయతీ కార్యాలయం నుండి పట్టణం వీధుల మీదుగా బాణాసంచా, తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి వారి నివాసానికి చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నసరుల్లాఖాన్, చికెన్ బాషా, వెంకట్రామిరెడ్డి, గోవిందు, మండ్ల శంకరరెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, బేగ్, షంషీర్, ఇలియాస్, అమీర్ హంజ పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాను "సింగిల్ యూజ్ ప్లాస్టిక్" రహిత నగరంగా మారుద్దాం

**కర్నూలు, నంది పత్రిక** ....కర్నూలు జిల్లాను "సింగిల్ యూజ్ ప్లాస్టిక్" రహిత నగరంగా మారుద్దాం అని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన అంశం పై జాయింట్ కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పర్యవేక్షించడానికి మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖూదీ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నెలలో 2 సార్లు ఖచ్చితంగా అన్ని షాపులను తనిఖీ చేయడంతో పాటు, నిషేధిత ప్లాస్టిక్ అమ్మే వ్యాపారులపై దాడులు నిర్వహించి, ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీగా జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

డప్పు కళాకారులు, సంగీత ప్రదర్శనలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. స్వయం సహాయక బృందాల ద్వారా పర్యావరణ హితమైన సంచుల విక్రయ మేళాలను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..



## అమరావతి రాజధానిగా ఉభయ సభల ఆమోదంతో ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసి దీపాలు వెలిగించండి.

### బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగమణి ప్రజలకు పిలుపు.



**బేతంచెర్ల ఏప్రిల్ 2 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండల ప్రజలకు బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగ మణి, మరియు బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్హరిప్రసాద్ బేతంచెర్ల పట్టణ ప్రజలకు గురువారం క్రింద తెలిపిన విధానాలను ప్రజలకు గురువారంప్రకటన ద్వారా తెలియ జేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధ గుర్తింపు లభించిన, ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సవాలు నిర్వహించ బడుతున్నాయి. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల ఆశయాలకు న్యాయం చేయడమే కాకుండా, భవిష్యత్ అభివృద్ధికి దారితీసే, ఒక ముఖ్య మైన ఘట్టంగా భావించ బడుచున్నది. ఈ సందర్భంగా, బేతంచెర్ల మండలంలోని ప్రతి కుటుంబం గురువారం సాయంత్రం తమ ఇళ్ల ముందుగా ముగ్గులు వేసి, దీపాలు వెలిగించి, కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు మరియు ఆనందోత్సవాలు నిర్వహించ వలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది. ఈ కార్యక్రమం ద్వారా మన రాష్ట్ర ఐక్యతను, అభివృద్ధి పట్ల మన సంకల్పాన్ని వ్యక్తపరచడం ముఖ్య ఉద్దేశ్యం. అందరూ స్వచ్ఛందంగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయగలరని వారు తెలియ జేశారు.

## రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ కు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం.





**పోలవరం/ ఏలూరు,బ్యూరో చీఫ్ ఏప్రియల్ 2నంది పత్రిక** పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనలో భాగంగా గురువారం హెలికాప్టర్ లో పోలవరం చేరుకున్న రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ కి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డా.నిమ్మల రామానాయుడు, పుష్పగుచ్చాలతో రాష్ట్ర గవర్నరుకు ఘనంగా స్వాగతం పలికారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు రాష్ట్ర గవర్నరుకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. పోలవరం ప్రాజెక్టు అడ్మిని స్ట్రేటరు & ఎక్స్ అఫీషియో జాయింటు కలెక్టరు వి. అభిషేక్, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, ఏఎస్పీ లు ఆర్.సుస్మిత, జయాశర్మ, డి.హేమంత్, పంకజ్ కుమార్ మీనా, జి.మునిరాజు, ఆర్డీవో యం.వి. రమణ, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీప్ రెడ్డి, ఐటిడిఏ పీవో కె.రాములు నాయక్, మెగా సంస్థ ప్రతినిధులు, ఇంజనీరింగు ప్రతినిధులు, తదితర ప్రభృతులు ఉన్నారు.





## పోలవరం ప్రాజెక్టు పను లను పరిశీలించిన రాష్ట్ర గవర్నర్ఎస్ అబ్దుల్ నజీర్





**ఏలూరు,బ్యూరో చీఫ్ ఏప్రిల్, 2 నంది పత్రిక** పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనలో భాగంగా పోలవరం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ ముందుగా ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ నుండి ప్రాజెక్ట్ పనుల పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డా. నిమ్మల రామానాయుడు, పోలవరం ప్రాజెక్ట్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కె.నరసింహ మూర్తి లు ప్రాజెక్ట్ పనుల పురోగతిని గవర్నర్ కు వివరించారు. అంతకుముందు ప్రాజెక్ట్ పనులను హెలికాప్టర్ నుండి ఏరియల్ వ్యూ ద్వారా గవర్నర్ పరిశీలించారు. ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, బలరామకృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, పోలవరం ప్రాజెక్టు అడ్మిని స్ట్రేటరు అభిషేక్, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, ఎస్ఈ ఆర్. రామచంద్రరావు, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీప్ రెడ్డి, ఐటిడిఏ పీవో కె.రాములు నాయక్, మెగా సిఓఓ ఏ .వి.సతీష్, జీఎం. గంగాధర్, ఇంజనీరింగు ప్రతినిధులు, తదితర ప్రభృతులు ఉన్నారు.





## ఇళ్ల స్థలాలు కోరుతూ దివ్యాంగుల నిరసన ఆర్డీఓ కు వినతిపత్రం

**బనగానపల్లె ఏప్రిల్ 2నందిపత్రిక** బనగానపల్లె నియెజకవర్గలో ఉన్న దివ్యాంగులకు ఇల్లాస్థలాలు మంజూరు చేయాలని గురువారం బనగానపల్లె ఆర్డీఓ కార్యాలయం ముందు దివ్యంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు అంజనం దేవరాజు ఆధ్వర్యంలో దివ్యాంగులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ మండలంలోని పట్టణం గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి వారికీ ఇల్ల నిర్మాణం చేపట్టాలని ఆర్డీఓ కు విన్నవించారు . ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని వారితో అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు అజీజ్ భాష గోపి మా భాష వెంకటేశ్వర్లు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా యాపదిన్నె సర్పంచ్ వసంత రామిరెడ్డి పదవీ విరమణ మహోత్సవం





**ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి**

**మహిళలకు కుట్టు మిషన్లు, రైతులకు స్ప్రేయర్ల పంపిణీ**

**నందిపత్రిక –డోన్** డోన్ మండలం యాపదిన్నె గ్రామ సర్పంచ్ వసంత రామిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం గురువారం గ్రామస్తుల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**సేవా కార్యక్రమాలతో వీడ్కోలు** సర్పంచ్ పదవీ విరమణను పురస్కరించుకుని గ్రామంలోని పేదలకు అండగా నిలిచేలా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి చేతుల మీదుగా:మహిళా సాధికారతకు తోడ్పాటునందించేలా పలువురు మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. రైతులకు సాగు పనుల్లో ఉపయోగపడే స్ప్రేయర్ పంపు మిషన్లను పంపిణీ చేశారు.

**అతిథుల ప్రసంగం** ఈ సందర్భంగా మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ, సర్పంచ్ వసంత రామిరెడ్డి తన పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, పదవిలో ఉన్నా లేకున్నా ప్రజా సేవలో కొనసాగడం అభినందనీయమని కొనియాడారు. గ్రామంలోని ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందేలా రామిరెడ్డి పారదర్శకంగా పనిచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర,ధర్మవరం మన్నె చిన్న నాగిరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు చాటకొండ శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు గండికోట రామ సుబ్బయ్య, మధుసూధన్, అడ్వకేట్ మహేశ్వర రెడ్డి, ఉంగరాణిగుండ్ల రాముడు, ఉంగరాణిగుండ్ల మద్దయ్య, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజాసేవలో ముందుండి సాగండి నిడ్జూరు సర్పంచ్, వార్డు మెంబర్లను సత్కరించిన వైఎస్సార్సీపీ కోడుమూరు ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్



**కర్నూలు నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో సర్పంచ్ ల పదవీకాలం పూర్తయినా ప్రజా సేవ ఆగకూడదని, అదే స్ఫూర్తితో ప్రజల మధ్య ఉండాలని వైయస్ఆర్సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు సత్యం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గ్రామ వార్డు నెంబర్లను కోడుమూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు సర్పంచ్ల సేవలను గుర్తించి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కరోనా మహమ్మారి కారణంగా ఎన్నికలు ఆలస్యమైనప్పటికీ, తమ ప్రభుత్వ కాలంలో సర్పంచ్లు గ్రామాల్లో మంచి పాలన అందించారని ప్రశంసించారు. అయితే గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వ సహకారం లేక సర్పంచ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గ్రామాల్లో సమస్యలు పెరిగినట్టు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. అధికారులు, అధికార పార్టీ సహకరించకపోయినా ప్రజల పక్షాన నిలబడి సేవలు అందించాలని సర్పంచ్లను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరిగే అవకాశం లేదని, అప్పటి వరకు సర్పంచ్ హోదాతోనే ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. వైయస్ఆర్సీపీ పాలనలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి ప్రాధాన్యం పెరిగిందని గుర్తు చేశారు. సర్పంచ్లు తమ ప్రభావాన్ని కొనసాగిస్తూ ప్రజలకు సేవలు అందించాలని కోరారు. అందరం కలిసికట్టుగా శ్రమించి తిరిగి జగనన్న ప్రభుత్వాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుపతి రెడ్డి, ధరణి రెడ్డి, కర్నూలు మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సంపత్, సురేష్, నరసింహులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పుకు పార్లమెంటు పట్టాభిషేకం.. అమరావతికి దక్కిన రాజ్యాంగ రక్షణ





**నంద్యాల గడ్డపై వెల్లివిరుస్తున్న విజయ గీతిక - మన రాజధాని, మన అమరావతి**

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 2 ( నంది పత్రిక )** నంద్యాల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే చారిత్రాత్మక నిర్ణయం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయంలో ఈ రోజు సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పద్మావతి ఆర్చి వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నా రాజధాని అమరావతి అనే నినాదాలు పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాజధాని కోసం ఎదురుచూస్తూ, పోరాటం చేస్తూ వచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా విభజించే ప్రయత్నం చేసి, ఆంధ్రప్రదేశ్కు స్థిరమైన రాజధాని లేకుండా చేసిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి, మంత్రి నారా లోకేష్ గారి సంకల్పంతో అమరావతిని తిరిగి ఒకే రాజధానిగా నిలబెట్టడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అమరావతి రైతులు, మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, మంత్రి నారా లోకేష్ గారు గారు చూపిన పట్టుదల, పోరాట స్ఫూర్తి ఈ విజయానికి ప్రధాన కారణమని మంత్రి ఫరూక్ తెలిపారు. శాంతియుతంగా పోరాడిన రైతుల త్యాగాలకు ఇది దక్కిన న్యాయం అని అన్నారు. ఇవాళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ పండుగ రోజు అని, ఇకపై రాబోయే తరతరాలకు అమరావతి అభివృద్ధి మరియు సంక్షేమానికి రెండు కళ్లుగా నిలుస్తుందని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే బ్రాండ్గా అమరావతి రూపుదిద్దుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఆనందాన్ని ప్రజలతో కలిసి పండుగలా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారి మద్దతుతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, మంత్రి నారా లోకేష్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకుల అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు





# శిరివెళ్లలో అంబరాన్నంటిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన వేడుకలు

**యామ గురప్ప ఆధ్వర్యంలో ఘన నిర్వహణ టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం**






**శిరివెళ్ళ : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నేత , మాజీ జడ్పిటిసి యామ గురప్ప ఆధ్వర్యంలో అంబరాన్నంటిన ఉత్సాహంతో నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా యామ గురప్ప మాట్లాడుతూ... భూమా అఖిలప్రియ ప్రజల కోసం నిరంతరం కృషి చేసే నాయకురాలని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధి , మహిళా సాధికారత , యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆమె చూపిస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రజల ఆశలు , ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రతి వర్గానికి అందుబాటులో ఉండే నాయకత్వం ఆమె సొంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నాయకులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఎంపీటీసీ యామ శ్రీనివాసులు , సోమశేఖర్ , కటకం శేఖర్ , నరేష్ , ఖాదర బాదరా టిడిపి నాయకులు బ్రహ్మయ్య , బండి చెన్నయ్య , తదితర నాయకులు పాల్గొన్నారు.

# శిరివెళ్లలో హోరెత్తిన జై అమరావతి నినాదాలు

**సీనియర్ నేతల నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ ఇంటింటి దీపాలతో సంబరాలు**

**అమరావతి శాశ్వత రాజధాని అంటూ ప్రజల్లో ఉత్సాహం**



**శిరివెళ్ళ :(నంది పత్రిక)** అమరావతి రాజధానికి పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ శిరివెళ్ళ మండలం కేంద్రంలో టిడిపి సీనియర్ నేతల నేతృత్వంలో టిడిపి శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం నుండి తెదేపా నాయకుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు , యువకులు ఈ ర్యాలీలో పాల్గొని జై అమరావతి , అమరావతి మా హక్కు అంటూ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ర్యాలీ అనంతరం ముఖ్య నాయకులు ఇంటింటికి వెళ్లి దీపాలు వెలిగిస్తూ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు.

**ప్రజలతో నేరుగా మమేకమవుతూ అమరావతి ప్రాధాన్యతను వివరించారు.** ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూడ అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని , శాశ్వత రాజధానిగా స్థిరపడటం రాష్ట్రానికి శుభపరిణామమని పేర్కొన్నారు. రాజధాని కోసం రైతులు , మహిళలు చేసిన త్యాగాలు వృథా కాలేదని , వారి పోరాటానికి ఇది న్యాయం జరిగిన రోజు అని అన్నారు. రాబోయే రోజుల్లో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా రూపుదిద్దుకుని , ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి , యువతకు ఉపాధి అవకాశాలు , పెట్టుబడులు అమరావతి ద్వారానే సాధ్యమవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి వీధిలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా శిరివెళ్ళ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఘనంగా వేడుకలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు యామ గురప్ప , సురా రామ , బి.సి ఫిదా , ఎం రసూల్ , రఫీ , జిక్రియ , అల్లబాకాష్ , యూనుస్ , సాధక్ , ముల్లా మహమ్మద్ హుస్సేన్ , శ్రీనివాస్ రెడ్డి , పెద్ద ఎత్తున కార్యకర్తలు , అభిమానులు రోడ్లపైకి చేరి బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# అమరావతికి చట్టబద్ధతపై వెలుగోడులో తెదేపా నాయకుల హర్షం



**వెలుగోడు, ఏప్రిల్ 02 (నంది పత్రిక):**వెలుగోడు పట్టణంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు పార్టీ ఆఫీసు నుండి సెంటర్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందిన శుభ సందర్భంగా పట్టణంలోని సెంటర్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అమరావతి రాజధాని స్థిరీకరణకు చట్టబద్ధత లభించడం రాష్ట్ర ప్రజల ఆకాంక్ష నెరవేరినట్లు భావిస్తున్నామని నాయకులు ప్రకటించారు. ఈ విజయంతో రాష్ట్ర అభివృద్ధికి మరింత వేగం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నారపు శేషిరెడ్డి, కలాం, మోమిన్ రసూల్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, సయ్యద్, అమీర్ హంజా, శాలు భాష, సూర్యనారాయణ, మద్దూర్ శీను, మండల తెదేప నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నంద్యాల నియోజకవర్గ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం..





### దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

### ముగియనున్న స్థానిక సంస్థల పదవీకాలం -

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 2 ( నంది పత్రిక )** నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక ప్రాధాన్యతను సంతరించుకున్నది. నంద్యాల నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం రేపటితో ముగియనున్న నేపథ్యంలో, నంద్యాల మరియు గోస్పాడు మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు మరియు ఎంపీటీసీలతో ఈరోజు నగరంలోని స్థానిక అన్నపూర్ణ హోటల్ నందు భారీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మరియు మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి పాల్గొని ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపే నాయకత్వంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో పార్టీ అత్యధిక మెజారిటీతో మళ్ళీ అధికారాన్ని చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి,ఎంపీపీలు: శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు: రామసుబ్బారెడ్డి. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు: పురుషోత్తం రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి: శివనాగిరెడ్డి, నంద్యాల మండల అధ్యక్షుడు: బసవేశ్వరరెడ్డి, వైసీపీ నేత: ప్రహ్లాదరెడ్డి మరియు పెద్ద సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.





## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు,2400 ప్రభుత్వ మద్దతు ధర అమలు కొరకు ఏప్రిల్ 9 న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు తరలి రండి.

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.

**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 02 (నంది పత్రిక):** నంద్యాల జిల్లాలో మొక్కజొన్న పంట సాగుచేసి, అధిక పెట్టుబడులు పెట్టి, పంట కల్లాలలోకి వచ్చిన తర్వాత పాలక ప్రభుత్వాలు తాము చట్టం చేసిన మద్దతు ధరల చట్టాన్ని సకాలంలో అమలు చేయకపోవడం మూలంగా మరియు మధ్య దళారులంతా సిండికేట్ గా మారి అది తక్కువ ధరకు మొక్కజొన్నలు చేయడం వలన జిల్లాలోని మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు చెప్పే చట్టం ప్రకారం క్వింటా మొక్కజొన్నలు 2400 రూపాయలకు కొనాల్సి ఉండగా ప్రస్తుతం దళారులు 1600 రూపాయల కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్రకారం ఈ ప్రకారం మన జిల్లాలో మొక్కజొన్న సాగుచేసిన ప్రతి రైతు , ప్రతి ఎకరా పైన సుమారు 25 వేల నుండి 30 వేల రూపాయల వరకు నష్టపోతున్నారు. అందువల్ల జిల్లాలోని అధికార యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి, జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు



ఏర్పాటు చేయించాలని, క్వింటా 2400 రూపాయల ప్రకారం ప్రభుత్వమే రైతుల వద్ద ఉన్న మొత్తం మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని కోరుతూ ఏప్రియల్ తేదీ 9న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు జిల్లాలోని రైతులందరూ రాజకీయాలకతీతంగా తరలి రావాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామచంద్రుడు,సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి . శ్రీనివాస రెడ్డి ప్రకటన ద్వారా రైతులను కోరారు. రుద్రవరం మండలంలోని కోటకొండ,కొత్తూరు, శ్రీరంగాపురం, అప్పనపల్లె, పెద్ద కంబలూరు గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ రైతుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రామచంద్రుడు మాట్లాడుతూ ఖరీఫ్ లో అధిక వర్షాలతో దిగుబడి తగ్గి ,కొనుగోలు కేంద్రాలు లేక నష్టపోయిన రైతులకు అండగా నిలువాల్సిన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు మాటలతో కాలయాప న చేసే రైతాంగాన్ని మోసం చేశారు. నేడురబీ సీజన్లో కాస్త పంట దిగుబడి పెరిగినా పాలక పక్షం నిర్లక్ష్యం వల్ల జిల్లాలో ఏ ఒక్క చోట కూడా ప్రభుత్వ కేంద్రాలుపెట్టడం లేదు. ట్రంప్ కు లొంగిపోయిన మోడీ మన దేశ రైతులకు నష్టం కలిగించే విధంగా అమెరికా నుండి మొక్కజొన్నలు దిగుమతి చేసుకోవటానికి ఒప్పందాలు చేసుకోవడం, ప్రస్తుతం ఇరాన్ దేశంతో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న యుద్ధాల ఫలితంగా మన దేశ రైతుల ఉత్పత్తులు ఎగుమతులు ఆగిపోయి తీవ్రమైన సంక్షోభంలో రైతాంగం ఉన్నారు. అందువల్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని అప్పుల ఊబి నుండి గట్టెక్కించేందుకై వెంటనే నంద్యాల జిల్లాలో మార్క్ఫెడ్ సంస్థ ద్వారా రైతుల వద్ద ఉన్న మొత్తం మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని ప్రకటన ద్వారా కోరారు.

## రమణీయుంగా శ్రీ తర్తూరు రంగనాథ స్వామి రథోత్సవం.







### స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గిత్త జయ సూర్య.

### లక్షమంది రథోత్సవానికి హాజరు.

### గట్టి పోలీసు బందోబస్తు మధ్య రథోత్సవం.

**జూపాడు బంగ్లా, ఏప్రిల్ :2:( నంది పత్రిక):** ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన తర్తూరు గ్రామంలో శ్రీశ్రీ లక్ష్మి రంగనాథ స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం లక్షలాదిమంది ప్రజల మధ్య రమనీయంగా సాగింది. జూపాడు బంగ్లా మండల పరిధిలోని తర్తూరు గ్రామంలో 700 సంవత్సరాల క్రితం వెలిసిన శ్రీ రంగనాథ స్వామిని కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న స్వామివారి రథోత్సవం ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో జరుగుతుంది. అయితే గురువారం జరిగిన రథోత్సవానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య హాజరయ్యారు. ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ఎమ్మెల్యే జయసూర్య ప్రత్యేక పూజలు నిర్వహించి న అనంతరం స్వామివారిని భాజా భజంత్రీల వాయిద్యాల నడుమ పూజారులు రథోత్సవం పై కూర్చొబెట్టారు. రథానికి ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య తో పాటు కూటమి పార్టీల నేతలు ప్రజలు, రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ప్రజలు కేరింతలు కొడుతూ గోవిందా నామాన్ని స్మరిస్తూ శ్రీ రంగనాథ స్వామిని రథంపై ఊరేగించారు. ఈ రథోత్సవానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నందికొట్కూరు రూరల్ సిఐ. టి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో 70 మంది పోలీసుల తో గట్టి ఏర్పాట్లు చేశారు. రథోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మందటి నారాయణరెడ్డి తోపాటు ఆలయ కమిటీ సభ్యులు,జూపాడుబంగ్లా, పగిడ్యాల,నందికొట్కూర్ టిడిపి పార్టీ కన్వీనర్లు గుండ్రెడ్డి మోహన్ రెడ్డి,పలుచాని మహేశ్వర్ రెడ్డి, మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి,తర్తూరు రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు చల్లా దామోదర్ రెడ్డి,తెలుగు యువత నాయకులు మందటి దొరబాబు రెడ్డి, దేవ సహాయం, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్య కార్యక్రమానికి జూపాడుబంగ్లా ఎస్సై కె. మల్లికార్జున, నందికొట్కూర్ , మిడుతూర్,ముచ్చుమర్రి, బ్రాహ్మణ కొట్టుకూరు ఎస్సైలు చంద్రశేఖర్, ఓబులేష్, నరేంద్ర,మణికంఠ లు తమ పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



### ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు బర్త్‌డేశుభాకాంక్షలు

**ఆళ్లగడ్డ చాగలమర్రి )ప్రతినిధి ఏప్రిల్ 2 నంది పత్రిక** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన పురస్కరించుకొని . చాగలమర్రి మెయిన్ బజార్,మార్కెట్ వీధి కూడలిలో నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం నాడు మజ్జిగ పంపిణీ చేశారు. సల్ల నాగరాజు మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా రైతన్నల కోసం నిత్యం



పోరాడి చివరి ఆయకట్టు వరకు మీరు వచ్చేలా, యువత కోసం జాబ్ మేళాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కలిగేలా, ఆళ్లగడ్డను వంద పడకల ఆసుపత్రిగా ఇక్కడ అవసరమైన వైద్య సేవలు అందించేలా తీర్చిదిద్దేందుకు,అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు కోసం, ఎటువంటి అభాగ్యులు తన ఇంటి వద్దకెళ్లి ఏ పని అడిగిన నిత్యం ప్రజల కోసం పనిచేసే పోరాట యోధురాలు తాము మనస్ఫూర్తిగా అభిమానించే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ,వారి కుటుంబం ఎల్లవేళలా సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, రాజకీయంగా ఉన్నతమైన శిఖరాలు చేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ... వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యాపారంతో పాటు రైతు సేవలో ముందుండాలి

### గుజ్జుల గౌరీశ్వర నాయుడు



**నందికొట్కూరు ఏప్రిల్ 2(నంది పత్రిక )** వై.ఎస్.ఆర్. సీ.పీ. రాష్ట్ర బీసీ వెల్ఫేర్ విభాగం ప్రధాన కార్యదర్శి కురువ రాముడు నందికొట్కూరులో నిర్వహిస్తున్న " వీరభద్ర ట్రేడర్స్" ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని ఆధునిక సదుపాయాలతో నూతన ప్రాంగణానికి మార్చి ఘనంగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు హాజరై, కురువ రాముడు కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గౌరీశ్వర నాయుడు మాట్లాడుతూ వ్యాపారంతో పాటు రైతుల సేవలో ముందుండాలి అని ఆకాంక్షించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందిస్తూ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ



**మహానంది ఏప్రిల్ 02 (నంది పత్రిక):-** రైతులకు పారదర్శకంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రభుత్వం అందజేస్తుందని మహానంది తహాశీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మహానంది మండల కేంద్రం తిమ్మాపురం గ్రామంలో భూ పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాలలో ప్రభుత్వం రైతులకు అత్యంత పారదర్శకంగా సురక్షితమైన క్యూఆర్ కోడ్,ప్రభుత్వ అధికార రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భూమి వివరాల భద్రత కోసం ఈ నూతన వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీడీవో మహబూబ్ దౌల,ఆర్ ఐ వెంకట సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత, వీఆర్వో సురేంద్రనాథ్ రెడ్డి,రెవెన్యూ సిబ్బంది,టీడీపీ మహానంది మండల అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి,టీడీపీ క్లస్టర్ ఇంచార్జ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి,బీజేపీ మహానంది మండల అధ్యక్షుడు కేఈ కిరణ్ కుమార్ గౌడ్,టీడీపీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు,తిమ్మాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నూలు వెంకటరంగయ్య, గ్రామ సర్వేయర్లు,వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు



**మహానంది ఏప్రిల్ 02 (నంది పత్రిక):-** మహానంది మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. గురువారం తిమ్మాపురం,గాజులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, క్రీస్తు జ్యోతి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ పరీక్షను విద్యార్థులు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు ఏర్పాటు చేపట్టారు. 10 వ తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు మళ్లీ ఎప్పుడు కలుస్తామో నేస్తం అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం కేరింతలు నడుమ ఆనంద భాష్పాలతో వీడ్కోలు పలుకుకున్నారు.

## బైక్ ప్రమాదం: ఒకరికి తీవ్ర గాయాలు



**నంది పత్రిక -ప్యాపిలి** మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.

**వివరాల్లోకి వెళ్తే** ఓబులేష్ అనే వ్యక్తి తన బైక్‌పై వెళ్తుండగా, వెంగళాంపల్లి సమీపంలో అదుపు తప్పి బైక్ స్కిడ్ అవ్వడంతో కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే, బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటం మెరుగైన వైద్యం అవసరం కావడంతో, ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కి రిఫర్ చేశారు. బాధితుడు ప్యాపిలి మండలానికి చెందిన వ్యక్తిగా సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# వైభవంగా సద్దలక్ష్మి శ్రీ కంబగిరి స్వామి కళ్యాణోత్సవం





## రమణీయంగా స్వామి రథోత్సవం

**అవుకు ఏప్రిల్ 2నందిపత్రిక** అవుకు మండలం జక్కులేరు వాగు వద్దున స్వయంభువుగా వెలసిన శ్రీ సద్దలక్ష్మి సమేత శ్రీ కంబగిరిస్వామి తిరు కళ్యాణోత్సవ బ్రహ్మోత్సవాలో భాగంగా ఐదవ రోజు గురువారం తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మండపంలో శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. అంతకు ముందు బుధవారం అర్ధరాత్రి స్వామి అమ్మవార్ల గజవాహన సేవ ఊరేగింపు ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారితే గురువారం 2 గంటలకు స్వామి వారి కల్యాణానికి సంబంధించిన రాయబార కార్యక్రమం ముగిసిన వెంటనే ఆలయ అనువంశిక అర్చకులు స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక మండపంలో అలంకరించి సాంప్రదాయ ప్రకారం వేద మంత్రోచ్చారణాల మద్య ఘనంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో అమ్మవార్ల తరపున బనగానపల్లె సిఐ మంజునాథరెడ్డి దంపతులు, స్వామివారి తరపున గూడాల ప్రతాపరెడ్డి,మురళీమోహన్ రెడ్డి దంపతులు పెళ్ళిపెద్దలుగా వ్యవహరించి కళ్యాణవేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు, కంబగిరిస్వామి కల్యాణ వేడుకలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆద్యంతం కల్యాణోత్సవం తిలకించి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు.

**రమణీయంగా స్వామివారి రథోత్సవం** గురువారం తెల్లవారుజామున స్వామివారి కళ్యాణోత్సవం అంగరంగవైభవంగా జరిగిన నేపథ్యంలో అదే రోజు సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణతో తేరులాగి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు.

**కంబగిరి స్వామి తిరుణాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

బ్రహ్మోత్సవాల వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి నాలుగవ రోజున స్వామివారి ప్రభోత్సవం, రాయబారం ఉత్సవాలు తిలకించేందుకు విచ్చేసిన భక్తుల కోసం ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తాడిపత్రి కి చెందిన వందనా గ్రూప్ డాన్స్ అకాడమీ నృత్య కళాకారిణులు చేసిన నృత్య ప్రదర్శన ప్రతి ఒక్కరిని అలరించాయి. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గూడాల బ్రదర్స్ పర్యవేక్షణలో జరిగాయి. **భారీ పోలీస్ బందోబస్తు** కంబగిరిస్వామి దేవస్థానంలో 6 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ వారు ముందస్తు చర్యలు చేపట్టారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అదేశాలమేరకు బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి పర్యవేక్షణలో బనగానపల్లె, అవుకు,నందివర్గం ఎస్సైలు దుగ్గిరెడ్డి, బాలరాముడు ,అశోక్ పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

# అమరావతికి చట్టబద్ధత కల్పించడంతో మండలంలో సంబరాలు



**మహానంది ఏప్రిల్ 02 (నంది పత్రిక):–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మహానంది మండలంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.మహానందిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.కూటమి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు,వారి సంకల్పానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు.ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలు నేడు దేశ రాజధానిలో ప్రతిధ్వనించాయని అన్నారు.ఈ సందర్భంగా అమరావతి ప్రస్తానంలో ప్రధాని మోదీ ప్రతీ కీలక సందర్భంలోనూ అండగా నిలిచారని గుర్తుచేశారు.మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నిరంతర కృషి ఫలితమే ఈ అమరావతికి చట్టబద్ధత కలిగిందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి ,క్లస్టర్ ఇంచార్జ్ నరాల చంద్రమౌళేశ్వరరెడ్డి,టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున రావు,మహానంది మండలంలోని అన్ని గ్రామాల కూటమి ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.మరియు మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణ సచివాలయాల వద్ద అధికారులు వేడుకలు నిర్వహించారు.సచివాలయాల ప్రాంగణాలను రంగవల్లులతో తీర్చిదిద్ది,దీపాలు వెలిగించి, కొవ్వొత్తులతో కృతజ్ఞతలు తెలిపారు.

# సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళి

**బనగానపల్లె ఏప్రిల్ 2 నందిపత్రిక** సర్దార్ సర్వాయి పాపన్న 316 వ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘము బనగానపల్లె వారు గురువారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్ర పటానికి పులమాల వేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమం లో జాతీయ బి. సి సంక్షేమ సంఘము బనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షులు ఈడిగ వెంకటరమణ గౌడ్, బనగానపల్లె గౌడ్ సంఘము అధ్యక్షులు దేవుడు గౌడ్, జయ మధు గౌడ్, బీజేపీ అధ్యక్షులు రూరల్ హరికృష్ణ గౌడ్, పలుకూరు మాసన్న గౌడ్, సంజీవ్ గౌడ్,విజయ్ గౌడ్, కొండయ్య గౌడ్, సుబ్బారాయుడు గౌడ్, జయమధు గౌడ్,రిషి కుమార్ గౌడ్, నరేంద్ర గౌడ్ లు పాల్గొన్నారు

# శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య ఘనంగా వేడుకలు



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధ గుర్తింపు లభించిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా గురువారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆంధ్రుడు ఎంతో గర్వించదగ్గ మంచి రోజు అన్నారు. నేడు పార్లమెంటులో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత రావడం పట్ల చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్నో బాధలు, కష్టాలు,చీకట్ల నుండి వెలుగులోకి రావడం జరిగింది అన్నారు. అమరావతికి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించడానికి కృషి చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. రాజధానిని అభివృద్ధి చేసుకుంటూ అన్ని మౌలిక సదుపాయాలు కల్పన ద్వారా రాష్ట్రం భవిష్యత్తులో ఎంతగానో అభివృద్ధి సాధిస్తుందన్నారు. 2014 లో రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని,ఒక్కొక్కటి అధికమిస్తూ నేడు శాశ్వత రాజధానిగా అమరావతిని సాకారం చేసుకోగలిగామన్నారు. అమరావతి రాష్ట్ర హృదయంగా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రబిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమరావతికి చట్టబద్ధ గుర్తింపు లభించడం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు న్యాయం జరిగిందని తెలిపారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా ప్రజలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా దీపప్రజ్వలన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడగా, పాల్గొన్నవారు అమరావతి రాజధాని నిర్ణయాన్ని హర్షిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహం ప్రాంగణంలో అమరావతి రాజధాని రంగవల్లిని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కర్పూర జ్యోతిని వెలిగించారు. తదుపరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్ పి అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా కేక్ కట్ చేసి స్వయంగా స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ పి అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఏ రాంబాబు, ఐసిడిఎస్ పిడి డి.శ్రీలక్ష్మి, తర్వాత మెప్మా పీడీ హెప్సిబా, తహసీల్దార్ రావి రాంబాబు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్. వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ అధికారి యు.మంగపతి రావు, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, ఎల్‌డిఎం నాగేంద్రప్రసాద్, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు విశ్వనాథరాజు, అల్లూరి సీతారామరాజు సేవాసమితి సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సెర్ప్, డిఆర్డిఏ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అమరావతికి రాజధానిగా చట్టబద్ధత లభించడంతో ఆంధ్రుల కళ నెరవేరింది:

## ఎమ్మెల్యే గిత్త జయసూర్య.

## పార్లమెంట్లో అమరావతికి రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత కల్పించడం పై హర్షం వ్యక్తం చేసిన తెలుగు తమ్ముళ్లు.



**నందికొట్కూర్ ఏప్రిల్ 2 ( నంది పత్రిక )** పార్లమెంటు వేదికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత ఆమోదం పొందడం హర్షించదగిన విషయమని దేశ ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన రోజు అని ఆంధ్రుల కళ నెరవేరిందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలో రాష్ట్ర రాజధానిగా పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై ఎమ్మెల్యే గిత్త జయసూర్య మరియు టిడిపి నాయకులతో ర్యాలీగా కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తూ హర్షం వ్యక్తం చేస్తూ బానసంచా పెల్చుతూ సంబరాలు చేసుకున్నారు. జాతీయ జెండాతో జై అమరావతి అంటూ ర్యాలీలో జై చంద్రబాబు జై మోడీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య సర్దార్ వల్లభాయ్ పటేల్ మరియు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రానికి రాజధానిగా అమరావతికి చట్టబద్ధ కల్పించడంపై ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఐదు కోట్ల ఆంధ్రుల కళ నెరవేర్చిన ఘనత దేశ ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య కొనియాడారు. రాష్ట్ర రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతుల మహా త్యాగాలు మరవలేనివని, వారందరికీ తెలుగు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా ప్రపంచ శ్రేణి నగరంగా అమరావతి తీర్చిదిద్ద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, టిడిపి నాయకులు గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, ఖాతా రమేష్ రెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, కళాఖర్, భరత్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మద్దిలేటి,మహిళా టిడిపి నాయకురాలు డాక్టర్ వనజ, ఎస్సీ సెల్ నాయకులు నిమ్మకాయల రాజు, ప్రవీణ్ రగడ, మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కమర్షియల్ అవసరాల కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించ కూడదు

**హోటల్ రెస్టారెంట్ యజమానులు పి ఎన్ జీ గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోండి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 2నంది పత్రిక** జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ హోటల్ రెస్టారెంట్ యజమానులు కమర్షియల్ అవసరాలు కొరకు గృహ అవసరాలు కొరకు వాడుకునే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వాడకూడదని హెచ్చరించారు.గురువారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలోని హోటల్స్, రెస్టారెంట్ యజమానులు సివిల్ సప్లయ్ పరిశ్రమలు ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ వినియోగంపై పాటించవలసిన నియమాలు ప్రభుత్వ మార్గదర్శకాలను వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కమర్షియల్ అవసరాల కోసం డొమెస్టిక్ సిలిండర్ లను వినియోగించరాదని స్పష్టం మైనా ఆదేశాలు చేశారు. ప్రతి హోటల్ ,రెస్టారెంట్ యజమానులు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు మాత్రమే వినియోగించాలని అన్నారు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ కేవలం ఆధరైజెడ్ విధానం ద్వారానే నిర్వహించుకోవాలని సూచించారు. ఈ విధంగా చేయడం వలన వాస్తవ డిమాండ్పై స్పష్టత ఏర్పడుతుందని సరఫరా వ్యవస్థను మెరుగు పరచడం సాధ్యమవుతుందని అన్నారు. గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెటును పూర్తిగా అరికట్టాలన్నారు ప్రతి గ్యాస్ కనెక్షన్ అధికారికంగా నమోదు చేయబడినది ఉండాలని, అనధికారికంగా కనెక్షన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని అన్నారు ప్రస్తుతం ప్రభుత్వం గ్యాస్ సరఫరా ఇబ్బంది ఉండటం వలన . పైప్ లైన్ గ్యాస్ సరఫరా వినియోగంపై మొగ్గు చూపాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పి ఎన్ జీ గ్యాస్ కనెక్షన్ పొందడానికి గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.జిల్లా అంతా పి ఎన్ జీ గ్యాస్ కనెక్షన్ విస్తారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం ప్రాంతంలో గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా అందిస్తున్న పి ఎన్ జీ సేవలను వినియోగించుకోవాలని హోటల్ ,రెస్టారెంట్ యజమానులకు సూచించారు. భవిష్యత్తులో గ్యాస్ సరఫరా వ్యవస్థను పూర్తిగా పి ఎన్ జీ ఆధారంగా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఓ ఎన్ సరోజ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు మంగపతిరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి ఏ సుందర్ రెడ్డి, హోటల్స్ రెస్టారెంట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు ఎంతో ముఖ్యం:జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపిఎస్




**కేసముద్రం, ఏప్రిల్ 02(నంది పత్రిక):** ప్రతి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడడం వల్ల తమ ప్రాణాలను రక్షించుకోవచ్చని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. గురువారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఎస్పీ ఆదేశాల ప్రకారం కేసముద్రం సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతికిరణ్, నరేష్ ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువత, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని "హెల్మెట్ ధరించండి – మీ జీవితం కాపాడుకోండి" అనే నినాదాలతో గ్రామ ప్రజల్లో చైతన్యం కలిగించారు. హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు ఎంత ముఖ్యమో వివరించారు. ఈ అవగాహన ర్యాలీకి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పలువురికి హెల్మెట్ లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పోలీస్ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# తిమ్మాపురం సర్పంచ్ కు ఘన సత్కారం



**మహానంది ఏప్రిల్ 02 (నంది పత్రిక):–** తిమ్మాపురం గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి ప్రత్యేక పాత్ర పోషించారని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత పేర్కొన్నారు. మహానంది మండలం తిమ్మాపురం స్వర్ణ సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం సర్పంచ్ పదవి కాలం పూర్తి కావడంతో సర్పంచ్ కల్లే శ్రీలక్ష్మిని ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామాభివృద్ధికి సర్పంచ్ విశేషంగా కృషి చేశారన్నారు.సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ప్రజలు తమకు బాధ్యతాయుతంగా అప్పజెప్పిన పదవిని సమర్ధవంతంగా సేవ భావంతో నిర్వహించానన్నారు.తమకు సహకారం అందించిన ప్రజలు,అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇక ముందు కూడా గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు.అనంతరం వార్డ్ మెంబర్లను, తాగునీటి సరఫరాలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనిచేసిన యోసన్న,నాగేంద్ర ఆచారిని సత్కరించి,మెమెంటోలు అందజేశారు. సచివాలయానికి రూ.10,000 విలువచేసే బీరువాను విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్ది స్వరూప,పిట్టల సునీత, సచివాలయ సిబ్బంది,పాల్గొన్నారు.



# కఠోర సాధన తోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు

**కర్నూలు నంది పత్రిక....**క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడల్లో కఠోర సాధన చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని సెట్కూర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్ అన్నారు.గురువారం గార్గేయపురం సిటీ ఫారెస్ట్ వద్ద ఉన్న నాగరవనం చెరువులో కర్నూలు జిల్లా స్థాయి శాప్ లీగ్ వాటర్ స్పోర్ట్స్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవినాష్ గుప్తా, రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి డాక్టర్ రుద్ర రెడ్డి,వాటర్ స్పోర్ట్స్ కోచ్ చంద్రశేఖర్ తో కలిసి ఆయన జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాను రెండు శాతం నుంచి మూడు శాతానికి పెంచిందన్నారు. క్రమశిక్షణతో ప్రతిరోజు అంకితభావంతో సాధన చేస్తే మంచి ఫలితాలు సిద్ధిస్తాయన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శాప్ ఆధ్వర్యంలో లీగ్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు.అనంతరం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను ఈనెల 11 నుంచి 12 వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి శాప్ వాటర్ స్పోర్ట్స్ లీగ్ పోటీలలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవినాష్ గుప్తా మాట్లాడుతూ పోటీలకు సంబంధించి టెక్నికల్ సపోర్ట్ ను అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఏ ఫెన్సింగ్ శిక్షకుడు మహేశ్వరరావు, జిమ్నాస్టిక్స్ శిక్షకుడు పవన్,జిల్లా వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గంగాధర్,బోల్ట్, పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com